# తెలుగు తోట 4

## తెలుగు వాచకం

సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

U7K1S5



X6Q8Y4

# విషయసూచిక



| క్ర.సం. | పాఠం | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|
| 1. | గాంధీ మహాత్ముడు (సంసిద్ధతా పాఠం) | మహనీయుల చరిత్ర | గేయం | జూన్-జులై | 1-6 |
| 2. | గోపాల్ తెలివి (సంసిద్ధతా పాఠం) | సమయస్ఫూర్తి | కథ | జులై | 7-14 |
| 3. | దేశమును ప్రేమించుమన్నా... | దేశభక్తి | గేయం | ఆగష్టు | 15 -26 |
| 4. | పరివర్తన | పిల్లల స్వభావం | కథ | సెప్టెంబర్ | 27-36 |
| 5. | సత్యమహిమ | నైతిక విలువలు | గేయకథ | అక్టోబర్ | 37-48 |
| 6. | ముగ్గుల్లో సంక్రాంతి | సంస్కృతీ సంప్రదాయాలు | వ్యాసం | నవంబర్ | 49-60 |
| 7. | పద్యరత్నాలు | నైతిక, మానవీయ విలువలు | పద్యం | డిసెంబర్ | 61-70 |
| 8. | బారిష్టర్ పార్వతీశం | హాస్యం | కథనం | జనవరి | 71-82 |
| 9. | రాజు-కవి | సామాజిక అంశం | పద్యకథ | ఫిబ్రవరి | 83-94 |
| 10. | పునశ్చరణ | | మార్చి, ఏప్రియల్ | | |

సంసిద్ధతా పాఠం

# 1 గాంధీ మహాత్ముడు

Z7F9F1

చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి



1. చిత్రంలో ఎవరెవరున్నారు? వారేం చేస్తున్నారు?
2. చిత్రంలో సన్నివేశం ఏమై ఉంటుంది?
3. మీకు తెలిసిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెప్పండి.

## కవి పరిచయం



బసవరాజు అప్పారావు (13.12.1894 - 10.6.1933)

భావకవి, గీత కర్త. జాతీయోద్యమ కాలంలో ఈయన గీతాలు ప్రజలను గాఢంగా ప్రభావితం చేశాయి. 'బసవరాజు అప్పారావు గేయాలు' పేరిట ఈయన గీతాలు సంపుటంగా వెలువడ్డాయి.

# గాంధీ మహాత్ముడు

ప॥ గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది


గాంధీ మహాత్ముడు చకచక నడువగ
కంపించి పోయిందీ భూదేవి కంపించి పోయిందీ
గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది

గాంధీ మహాత్ముడు కన్నువిప్పగా
గడగడ వణికిందీ అధర్మము గడగడ వణికిందీ
గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది

గాంధీ మహాత్ముడు - నవ్వు నవ్వగా
కన్నుల గట్టిందీ - స్వరాజ్యం కన్నుల గట్టిందీ
గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది

గాంధీ మహాత్ముడు గొంతు విప్పగా
గణగణ మ్రోగిందీ - ప్రణవము గణగణ మ్రోగిందీ!
గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది

గాంధీ మహాత్ముడు స్వస్తి పాడగా
కరముల దొరికిందీ - మోక్షము కరముల దొరికిందీ!
గాంధీ మహాత్ముడు బయలుదేరగా
కలకల నవ్వింది జగత్తు-కలకల నవ్వింది



## పదాలు-అర్థాలు

స్వరాజ్యం = సొంత పాలన
ప్రణవం = ఓంకారం
మోక్షం = విడుపు, విముక్తి
అధర్మం = అన్యాయం (ధర్మం కానిది)
కంపించుట = వణుకుట
స్వస్తి = శుభం

## భావం

గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య సాధన కొరకు బయలుదేరగా ఈ జగత్తు ఆనందంతో నవ్వింది.
గాంధీ స్వాతంత్ర్య సాధన కొరకు వేగంగా నడవగా ఈ భూమి కంపించి పోయింది.
మహాత్ముడు కన్నెత్తి చూడగా అధర్మం గడగడ వణికిపోయింది.
జాతిపిత బోసినవ్వు నవ్వగా స్వరాజ్యం కనుల ఎదుటే కనిపించింది.
బాపూజీ మాట్లాడినపుడు ఓంకారం వలె గణగణ మ్రోగింది.
గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య ఉద్యమానికి స్వస్తి పాడగా స్వరాజ్యం అనెడి మోక్షము చేతికి చిక్కింది.






## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. గాంధీ గురించి జగత్తు కలకల ఎందుకు నవ్వింది?
2. స్వరాజ్యం అంటే ఏమిటి ?
3. గాంధీ స్వాతంత్ర్య సమర నినాదాలే మంత్రాలుగా మారుమ్రోగాయి కదా! మీకు తెలిసిన కొన్ని స్వాతంత్ర్య నినాదాలు చెప్పండి.
4. గడగడ వణకడం అంటే ఏమిటి?
5. గంట గణగణ మోగుతుంది. ఇలా గంటలు ఎక్కడెక్కడ గణగణ మోగుతుంటాయో చెప్పండి.

ఈ మాసపు పాట

# తేనెల తేటల మాటలతో



పల్లవి :
తేనెల తేటల మాటలతో
మన దేశమాతనే కొలిచెదమా
భావం భాగ్యం కూర్చుకుని
ఇక జీవనయానం చేయుదమా
॥తేనెల॥

చ॥ 1)
సాగరమేఖల చుట్టుకొని
సురగంగ చీరగా మలచుకొని
గీతాగానం పాడుకొనీ
మనదేవికి యివ్వాలి హారతులు
॥తేనెల॥

చ॥ 2)
గాంగ జటాధర భావనతో
హిమశైల రూపమే నిలబడగా
గలగల పారే నదులన్నీ
ఒక బృందగానమే చేస్తుంటే
॥తేనెల॥

చ॥ 3)
ఎందరొ వీరుల త్యాగఫలం
మన నేటి స్వేచ్ఛకే మూలధనం
వారందరినీ తలచుకొని
మన మానస వీథిని నిలుపుకొని
॥తేనెల॥

## కవి పరిచయం



ఇంద్రగంటి శ్రీకాంతశర్మ (29.05.1944 - 25.07.2019)

కవి, కథకులు, విమర్శకులు. తెలుగులో అనుభూతి కవిత్వానికి ప్రతినిధి. 'అనుభూతి గీతాలు' ఈయన కవితా సంపుటి, లలితగీత కర్త, ఆకాశవాణిలో పని చేశారు.

ఈ మాసపు కథ

# తెలివైన దుప్పి

(జాతక కథ)


బోధిసత్వుడు ఒక అడవిలో దుప్పిగా జన్మించాడు. అతనికి ఒక చెట్టు పండ్లంటే ఇష్టం.

ఒక వేటగాడు ఇదంతా గమనించాడు. చెట్టు కింద బుట్టలో పండ్లు అమర్చాడు. దానికి ఒక ఉచ్చు అల్లాడు. చెట్టు మీద కూర్చుని దుప్పి కోసం ఎదురు చూస్తున్నాడు. దుప్పి వచ్చి పండు నోటితో అందుకోగానే వేటగాడు తాడు లాగుతాడు. దుప్పి ఉచ్చులో పడిపోతుంది. ఇది వాడి ఆలోచన.

దుప్పి రానే వచ్చింది. కాని దూరంగా ఆగింది. పండ్లు బాగా మగ్గి తీయని వాసన వస్తోంది. ఒక వైపు పండు తినాలని అనిపిస్తున్నది కాని పండ్లు ఉన్న తీరు దుప్పికి సందేహం కలిగించింది. అది ముందుకు రాకుండా నిలబడి చూస్తూ ఉంది.

వేటగాడు దుప్పిని చూశాడు. అది ఆగి నిలబడి ఉండడం గమనించాడు. వాడికి తొందరయిపోతోంది. దుప్పి వెనక్కి వెళ్లి పోతుందేమో. దానికి పండ్లు కనబడాలని చెట్టు మీద నుండి కొన్ని పండ్లు విసిరాడు. ఒక్కొక్కటే తింటూ అది బుట్ట దగ్గరకు వస్తుందని వాడి ఆశ.

కాని దుప్పి చాలా తెలివైంది. చెట్టు నుంచి పండ్లు రాలితే సూటిగా కింద పడుతాయి. అంతేగాని ఎవరో విసిరినట్లు పడవు కదా! ఏదో తిరకాసు ఉందని అర్థమయింది. చెట్టు మీద ఉన్న వేటగాణ్ణి చూసింది. కాని చూడనట్లే చెట్టుతో అన్నది. చెట్టూ! చెట్టూ! పండ్లు విసురుతున్నావేమిటి? నీ అలవాటు మార్చుకున్నావా? అయితే నేనూ నా అలవాటు మార్చుకుంటాను. ఇక నీ దగ్గరకి పండ్ల కోసం రాను, అంటూ వెనుదిరిగి పోబోయింది. వేటగాడికి దుప్పి చిక్కలేదని కోపం వచ్చింది. గట్టిగా అరిచాడు. ఇవాళ తప్పించుకుంటే తప్పించుకున్నావు? రేపు నిన్ను వదిలేది లేదు.



వేటగాడు పూర్తిగా బయట పడి పోయాడు. మళ్లీ నీకు దొరుకుతానా అనుకుంటూ దుప్పి దట్టమైన అడవిలో మాయమై పోయింది. మోసగాళ్లుంటారు. వాళ్ల మాయలో పడకూడదు. ఆశ ప్రమాదాల్లోకి నెడుతుంది. జాగ్రత్తగా ఉండాలి.


E8X9D6

సంసిద్ధతా పాఠం

# 2 గోపాల్ తెలివి

P4U3L5

## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి




1. చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?
2. పై చిత్రాల ఆధారంగా కథను చెప్పండి?

# గోపాల్ తెలివి



ఒకసారి ఢిల్లీ సుల్తానుకు ఒక ఆలోచన వచ్చింది. తన సామంత రాజులందరినీ పిలిపించాడు. సుల్తాను తమను ఎందుకు పిలిపించాడా అని వాళ్లంతా మథనపడుతున్నారు.

దర్బారు ప్రారంభమయింది. సుల్తాను అందరినీ కలయజూశాడు. నేను రెండు ప్రశ్నలు వేస్తాను. సమాధానాలు చెప్పగలరా? అని అడిగాడు సుల్తాను.

సామంతులంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. సుల్తాను అడిగాడు "ఈ భూమి పొడుగు ఎంత? వెడల్పు ఎంత?" అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

సుల్తాను తన రెండో ప్రశ్న అడిగాడు "ఆకాశంలో ఎన్ని నక్షత్రాలున్నాయి?" ఈసారి సామంతుల ముఖాలు పాలిపోయాయి. ఏమిటీ ప్రశ్నలు? వీటికి ఎవరు జవాబులు చెప్తారు?

తమ తమ పట్టణాలకు వెళ్లి, పండితులతో చర్చించి చెప్తామన్నారు వాళ్లు. సుల్తాను త్వరగా సమాధానం చెప్పమన్నాడు. సామంతులంతా తమ పట్టణాలకు వెళ్లిపోయారు.

సుల్తాను సామంతుల్లో మాల్వారాజు జయచంద్రుడొకడు.

జయచంద్రుడు సభచేశాడు. దర్బారులో ఉన్న పండితులందరికీ సుల్తాను వేసిన ప్రశ్నలు వినిపించాడు.

ఆస్థానపండితులు కూడా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఎలా చెప్పగలరు? సుల్తాను కావాలనే ఇటువంటి చిక్కుసమస్య ఇచ్చాడన్నారు.

ఇంతలో ఆస్థాన విదూషకుడు గోపాల్ వచ్చాడు. ప్రశ్నలు విన్నాడు. ఒక్క క్షణం ఆలోచించాడు. అతని ముఖంలో చిరునవ్వు వెలిసింది. "ఇంతేనా! దీనికి దిగులుపడతారెందుకు? నన్ను సుల్తాను దగ్గరికి పంపండి. నేను చూసుకుంటాను" అన్నాడు.

గోపాల్ విషయాన్ని ఇంత తేలిగ్గా తీసుకోవడం జయచంద్రుడికి కోపం తెప్పించింది. "తమాషా కాదు, తలలు పోతాయి" అన్నాడు.

గోపాల్ కూడా గంభీరంగా అన్నాడు "రాజా! ఎటువంటి చిక్కు ప్రశ్నకైనా సమాధానం ఉండకతప్పదు. అపాయాన్ని ఉపాయంతో తప్పించుకోవాలి. ఈ విషయం నాకు వదిలేయండి. మీరు నిశ్చింతగా ఉండండి."

రాజు గోపాల్‌ని సుల్తాను దగ్గరికి పంపాడు.

గోపాల్ సుల్తాను దర్బారుకు వెళ్లి సుల్తానుకు వందనం చేశాడు. తానెవరో ఎందుకు వచ్చాడో చెప్పుకున్నాడు.


"అయితే సమాధానాలు చెప్పు" అన్నాడు సుల్తాను.

"మహా ప్రభూ! ఇవి ఎటువంటి చిక్కుప్రశ్నలో మీకు తెలుసు. ఈ భూమినంతా కొలవాలి, ఆకాశంలో ఉన్న నక్షత్రాలన్నీ లెక్కపెట్టాలి. చాలా డబ్బు ఖర్చవుతుంది. సమయం పడుతుంది" అని చెప్పాడు గోపాల్.

సుల్తాను తల ఊపాడు. చాలా డబ్బు ఇచ్చాడు.

"నీకు సంవత్సరం గడువు ఇస్తున్నాను. మళ్లీ ఈనాటికి నీవు జవాబులతో రావాలి. లేకపోతే నీకు కఠినమైన శిక్ష విధిస్తాను" హెచ్చరించాడు సుల్తాను.

"అలాగే ప్రభూ!" అంటూ సెలవు తీసుకున్నాడు గోపాల్.



గోపాల్ తన పట్టణానికి వెళ్లిపోయాడు. రాట్నాల వాళ్లని చేతనైనంత దారం వడకమని డబ్బిచ్చాడు.

సంవత్సరం పూర్తికావచ్చింది. వడికిన దారం పదహారు బండ్లకు సరిపోయింది. గోపాల్ పాతిక గొర్రెలు కొన్నాడు. సరిగ్గా గడువు రోజున సుల్తాను దర్బారులో ప్రత్యక్షమయ్యాడు.

సుల్తాను అడిగాడు "గోపాల్ జవాబులు తెలుసుకున్నావా?"

గోపాల్ "తెలుసుకున్నాను మహాప్రభూ!"

"అయితే చెప్పు. ఆలస్యమెందుకు?" అన్నాడు సుల్తాను.

"మహాప్రభూ! సభా భవనం వెలుపల ఉంచాను జవాబులు. మీరు వచ్చి చూడండి. ఇక్కడికి తీసుకొనిరాలేను" అని చెప్పాడు గోపాల్.

సుల్తానుకు ఆశ్చర్యం కలిగింది. సమాధానాలు వెలుపల ఉన్నాయా? సరే చూద్దాం అనుకున్నాడు.

దర్బారీలందరితో సుల్తాను సభాభవనం ఆవరణలోకి వచ్చాడు. అక్కడ పదహారు బండ్లున్నాయి. వాటిలో పెద్ద పెద్ద దారపు ఉండలున్నాయి. సుల్తాను గోపాల్ వైపు చూశాడు.

"మహాప్రభూ! ఈ ఎనిమిది బండ్లలోని దారంతో భూమి నిలువును కొలిచాను. తక్కిన ఎనిమిది బండ్ల దారం భూమి అడ్డం కొలత. ఈ దారం కొలుచుకుంటే మీకు భూమి పొడుగు, వెడల్పు తెలిసిపోతుంది."

సుల్తానుకేదో అర్థమైంది. "సరేలే, మరి నక్షత్రాలో" అన్నాడు.

"ఆఁ ఆ లెక్క కూడా తెచ్చాను. ఇవిగో ఈ పాతిక గొర్రెలు. ఆకాశంలో ఒక్కో నక్షత్రానికి ఒక్కో గొర్రె వెంట్రుక. ఈ గొర్రెల వెంట్రుకలన్నీ లెక్కించుకుంటే మీకు నక్షత్రాల సంఖ్య ఇట్టే తెలిసిపోతుంది మహాప్రభూ" అన్నాడు గోపాల్ ఎంతో వినయంగా. సుల్తానుకు గోపాల్ తెలివి పూర్తిగా అర్థమైపోయింది. ఏమనగలడు? కాదనలేడు, ఔననలేడు. అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ సుల్తాను పకపకా నవ్వాడు.

"చాలా చక్కగా ఉన్నాయి నీ సమాధానాలు గోపాల్" అని ప్రశంసించాడు. గోపాల్‌ని సన్మానించి పంపాడు.

బహుమతులతో తిరిగి వచ్చిన గోపాల్‌ని చూసి జయచంద్రుడెంతో సంతోషించాడు. జరిగిన కథంతా విని పగలబడి నవ్వడం ఇప్పుడతని వంతయింది.



## పదాలు-అర్థాలు

| | | |
|---|---|---|
| దర్బారు | = | రాజసభ |
| విదూషకుడు | = | హాస్యగాడు |
| సామంతులు | = | రాజుకింద ఉండే చిన్నరాజులు |



## వినడం - ఆలోచించి మాట్లాడడం

1. ఢిల్లీ సుల్తానుకు వచ్చిన ఆలోచన ఏమిటి?
2. సుల్తాను అడిగినది చిక్కు సమస్య. చిక్కుసమస్య అంటే ఏమిటి? ఇలాంటివి మీరు విన్నవి చెప్పండి.
3. 'గోపాల్ తెలివి' కథను మీ సొంత మాటల్లో చెప్పండి.



## పదజాలం

అ) పాఠం చదవండి. పాఠంలోని గుణింతాక్షర పదాలను రాయండి.

ఉదా. పొడుగు ........................ ........................ ........................

........................ ........................ ........................ ........................

........................ ........................ ........................ ........................

ఆ) పాఠం చదవండి. పాఠంలోని ద్విత్వాక్షర పదాలను గుర్తించి రాయండి.

ఉదా. చిక్కు ........................ ........................ ........................

........................ ........................ ........................ ........................

........................ ........................ ........................ ........................

ఇ) పాఠం చదవండి. పాఠంలోని సంయుక్తాక్షర పదాలను గుర్తించి రాయండి.

ఉదా. సుల్తాను ........................ ........................ ........................


........................ ........................ ........................ ........................

........................ ........................ ........................ ........................



ఈ మాసపు పాట

# చూడగంటి



రాగం : బృందావని　　　　తాళం : ఖండ

పల్లవి : కంటి నఖిలాండ కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥


చ॥ మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహు విభవముల మంటపములు గంటి
సహజనవరత్న కాంచనవేదికలు గంటి
రహివహించిన గోపురంబులవె కంటి ॥

చ॥ పావనంబైన పాప వినాశనము గంటి
కైవసంబగు గగన గంగ గంటి
దైవికపు పుణ్య తీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరు గంటి ॥

చ॥ పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్య హస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడగంటి ॥

## కవి పరిచయం

### తాళ్ళపాక అన్నమయ్య
(9.5.1408 - 23.2.1503)



పద కవితా పితామహులు. 32వేల సంకీర్తనలను రాశారని ప్రతీతి. వేంకటేశ్వరస్వామి కేంద్రంగా విశిష్ట సాహిత్యాన్ని, సంగీత సంస్కృతిని నిర్మించారు. తేట తెలుగు పలుకుబడి, దేశీ పద సంపద, వాడుక భాషలోని అపురూప మాధురి అన్నమయ్య కవిత్వంలో పొంగిపొర్లుతుంటాయి.

# విందు



ఒకరోజు సూర్యుడు, చంద్రుడు, వాయువు విందుకెళ్ళారు. వాళ్ల తల్లి నక్షత్రం. వాళ్లు ఎప్పుడు తిరిగి వస్తారా అని ఆమె ఆత్రంగా ఎదురు చూడసాగింది.

సూర్యుడు, వాయువు అక్కడ విందులో వడ్డించిందల్లా కడుపునిండా మెక్కారు. ఇంకా ఏమున్నాయి, ఇంకా ఏమున్నాయి అని అడిగి తెలుసుకొని సుష్టుగా భోంచేశారు. వాళ్లకు తింటున్నప్పుడు తల్లి ఒక్కసారి కూడా గుర్తుకు రానేలేదు. కేవలం కడుపే కైలాసంగా భావించారు తప్ప తమ తల్లి గురించి ఆలోచించనే లేదు. అయితే చంద్రుడు మాత్రం తల్లిని మరచిపోలేదు. తన ముందుంచిన రుచికరమైన పదార్థాలలో కొన్నింటిని తల్లికోసం జాగ్రత్తగా మూట కట్టుకున్నాడు.

వాళ్లు విందు ముగించి ఇంటికి వెళ్లేసరికి అర్ధరాత్రి దాటింది. అయినా వాళ్ల తల్లి నక్షత్రం వాళ్లకోసం మేలుకునే ఉంది. బిడ్డలు ముగ్గురూ ఇంటికి రాగానే "నాయనా నా కోసం ఏం తెచ్చారు మీరు?" అని అడిగింది ఆశగా. అమ్మమాట విన్న సూర్యుడు కాస్త ఉలిక్కిపడుతూ "అయ్యో! నీ కోసం నేనేమీ తేలేదమ్మా. వాళ్లు పెట్టింది స్నేహితులతో హాయిగా ఆస్వాదించానేతప్ప నువ్వు గుర్తుకు రాలేదమ్మా!" అన్నాడు. కొడుకు మాటలు విన్న చుక్కతల్లి గుండె కలుక్కుమంది. ఆమె వాయువు వైపు చూసింది. అతడు ఇలా సమాధానమిచ్చాడు. "నేను కూడా నీ కోసం ఏమీ తేలేదమ్మా! నేను

సుష్టుగా భోంచేయడానికి విందుకు వెళ్ళాను తప్ప నీకోసం ఏదో ఒకటి తేవాలనుకోలేదు." ఆ తల్లి హృదయం మరింత గాయపడింది. ఆమె వీడేం చెబుతాడో చూద్దామనుకొని చంద్రునివైపు చూసింది. చంద్రుడు తల్లితో ఇలా అన్నాడు. "అమ్మా! నువ్వొక పళ్ళెం తీసుకురా! నీ కోసం అత్యంత రుచికరమైన పదార్థాలను తెచ్చాను. నేను విందులో ఏ పదార్థం తింటున్నా నువ్వే గుర్తుకు వచ్చావంటే నమ్ము!" చంద్రుడి మాటలు విన్న చుక్కతల్లి హృదయం ఆనందంతో నిండిపోయింది.

చుక్కతల్లి తర్వాత సూర్యుడివైపు తిరిగి ఇలా శపించింది. "నువ్వు విందు ఆస్వాదిస్తున్నప్పుడు నీకు నీ తల్లి గుర్తుకురానందుకు నువ్వు సిగ్గుపడాలి. నువ్వు వట్టి స్వార్థపరుడివి. కనుక ప్రజలు నిన్నెప్పుడూ తిట్టుకుంటారు. నీ కిరణాల వేడి ప్రజలను బాధపెట్టుగాక. నువ్వు తీవ్రంగా మండుతున్నప్పుడు నీ మొహం ఎవ్వరూ చూడరుగాక చూడరు. నిన్ను చూడగానే నెత్తిమీద గుడ్డయినా వేసుకుంటారు లేదా గొడుగైనా అడ్డం పెట్టుకుంటారు".

తర్వాత చుక్కతల్లి వాయువువైపు చూస్తూ ఇలా శపించింది. "నువ్వు కూడా స్వార్థజీవివి. విందు ఆస్వాదిస్తున్నప్పుడు నేను నీకు గుర్తుకు రాలేదు. ఎండాకాలం నీ వడ సోకి ప్రజలు బాధపడతారు. సూర్యుని వేడిని వడగాలిగా మార్చి జనాలను బాధపెట్టే నిన్ను ప్రతి ఒక్కరూ నిందిస్తారు. నిన్నెవ్వరూ అభిమానించరుగాక!"

చివరన చుక్కతల్లి చంద్రుని వైపు తిరిగి ఇలా సౌమ్యంగా అంది. "బిడ్డా, విందు తింటున్నప్పుడు కూడా నువ్వు నన్ను మరువలేదు. తల్లిపట్ల నీకు కృతజ్ఞత ఉంది. ఇది అరుదైన, అమూల్యమైన సుగుణం. ఇకమీదట నువ్వు చల్లగా వుంటావు. నీ కిరణాలు ప్రజలకు హాయి, ఆనందం కలిగిస్తాయి. నిన్ను అందరూ ప్రశంసిస్తారు. నీ రాకకోసం ప్రజలు నిరీక్షిస్తారు.



R7M6G8

## కవి పరిచయం



### సొదుం రామ్మోహన్ (2.03.1939 - 12.11.2008)

పత్రికా రచయిత. పలు రచనలు, అనువాదాలు చేసారు. నిఘంటు నిర్మాణం కూడా చేసారు. రెండు దశాబ్దాల పాటు 'విశాలాంధ్ర'లో, ఒక దశాబ్దం పాటు 'ఉదయం'లో పని చేసారు.

# 3 దేశమును ప్రేమించుమన్నా...

D5D1D3


## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి




1. చిత్రంలో ఏమేమి ఉన్నాయి? ఎవరెవరు ఉన్నారు?
2. జెండా ఎప్పుడెప్పుడు ఎగరవేస్తారు?
3. మన జాతీయ జెండా గొప్పతనం గూర్చి చెప్పండి.


### కవి పరిచయం

**గురజాడ వేంకట అప్పారావు** (21.9.1862 - 30.11.1915)



ఆధునిక తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి మార్గదర్శకులు. యుగకర్త, కవి, కథకులు, నాటక కర్త, చరిత్రకారులు, శాసన పరిశోధకులు. అన్నిటికన్నా ముఖ్యంగా భాషావేత్త. తెలుగు సాహిత్యంలో వాడుకభాషను ప్రవేశపెట్టి చిరస్మరణీయమైన రచనలు చేశారు. 'కన్యాశుల్కం' నాటకం ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత విశిష్ట రచన.

# దేశమును ప్రేమించుమన్నా...



దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా!
ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయి

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్!




దేశాభిమానం నాకు కద్దని
ఒట్టి గొప్పలు చెప్పుకోకోయి,
పూని యేదైనాను ఒకమేల్
కూర్చి జనులకు చూపవోయి!

సొంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్!

చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్

## పదాలు-అర్థాలు

ఒట్టి = ఏమీ లేని
కద్దు = కలదు; ఉన్నది
దేశాభిమానం = దేశం మీద ప్రేమ
చెట్టపట్టాలు = ఒకరి చేతిని మరొకరు పట్టుకొనటం
తోడుపడు = సహాయపడు

## భావం

1. దేశము నాదని ప్రేమించు. మంచిని ప్రోత్సహించు. మాటలతో కాలం వృథా చేయకుండా ఉపయోగపడే పనులు చెయ్యి.
2. మనదేశం పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండేలా కృషి చేయాలి. అప్పుడు దేశంలో ఉన్నవారందరికీ ఆహారం లభిస్తుంది. పౌష్ఠిక ఆహారం తిన్న మనిషి ఆరోగ్యంగా ఉంటాడు.
3. నాకు దేశం మీద గౌరవం అని ఎక్కువ గొప్పలు చెప్పవద్దు. జనులకు ఏదైనా ఒక మేలు చేసి చూపించు.
4. సొంత పనులు కొన్ని మానుకొనైనా సరే ఇతరులకు సహాయపడాలి. దేశం అంటే కేవలం రాళ్ళు రప్పలే కాదు, దేశం అంటే జన సమూహం అని తెలుసుకో.
5. సుఖ దుఃఖాలలో అందరూ కలసికట్టుగా నడవాలి. దేశ ప్రజలందరూ మతాలు, జాతులూ వేరైనా అన్నదమ్ములలాగా కలిసి 'ఒకే మాట ఒకే బాట' గా నడవాలి.



## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం

1. గేయంలో దేశాన్ని ప్రేమించాలి అన్నారుకదా! దేశాన్ని ప్రేమించాలంటే మీరు ఏం చేస్తారు?
2. గేయ సారాంశాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.
3. ఈ గేయం ఆధారంగా దేశభక్తిని గురించి మీ భావాలు తెలపండి.



## చదవడం - వ్యక్తపరచడం

అ) పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. గట్టి మేలు తలపెట్టాలంటే మనం ఏమి చేయాలి?

........................................................................................................

2. మంచిని పెంచడమంటే ఏమిటి?

........................................................................................................

ఆ) కింది వాక్యాలు చదవండి. వీటికి సంబంధించిన గేయ పాదాలను పాఠంలో గుర్తించండి.



1. పాడి పంటలు సమృద్ధిగా పండించే దారిలో నువ్వు కృషిచెయ్యి.
2. నాకు దేశాభిమానం ఉన్నది.
3. దేశమంటే మట్టి కాదు; మనుషులు.
4. అన్నదమ్ముల వలె కలిసి మెలసి ఉండాలి.


ఇ) గేయంలో ప్రాస పదాలను గుర్తించి రాయండి.

ఉదా॥ ప్రేమించుమన్నా - పెంచుమన్నా

______________________ ______________________

______________________ ______________________

ఈ) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయండి.



బాల శివాజీని తండ్రి శంభోజీ బీజాపూరు సుల్తాన్ కొలువుకు తీసుకొని వెళ్ళాడు. ఆ సుల్తానుకు ఎలా వందనం చేయాలో తండ్రి శివాజీకి తర్ఫీదు ఇచ్చాడు. దేశభక్తి మెండుగా గల్గిన శివాజీ 'విదేశీయునికి శిరస్సు వంచను' అని తనలో తాను అనుకున్నాడు. సుల్తాను కొలువుకు వెళ్ళిన తరువాత శంభోజీ ఆయనకు నమస్కారం చేసి, కొడుకు వంక చూసాడు. శివాజీ శిరస్సు వంచి నమస్కరించకుండా ఠీవిగా నిల్చున్నాడు. సుల్తానుకు కోపం వచ్చింది. అక్కడే ఉన్న మురారి పంతులు, "చిన్నపిల్లవాడు. ఇంకా మర్యాదలు తెలియనివాడు" అని సుల్తానుకు సర్దిచెప్పాడు. శంభోజీ తరువాత శివాజీని మందలించబోగా "తండ్రీ! నేను జీవించి ఉండగా పరాయి పాలకుల ముందు తలవంచను. ఆత్మాభిమానంతో జీవిస్తాను" అని బదులు ఇచ్చాడు.

1. శివాజీని చిన్నతనంలో తండ్రి ఎక్కడికి తీసుకొని వెళ్ళాడు?

.......................................................................................................................................

2. సుల్తాను ఎదురైతే ఏం చేయాలని శివాజీకి తండ్రి చెప్పాడు?

.......................................................................................................................................

3. శివాజీ సుల్తాను కొలువులో ఎలా ప్రవర్తించాడు?

.......................................................................................................................................

4. ఆత్మాభిమానంతో జీవించడం అంటే ఏమిటి?

.......................................................................................................................................

5. పై పేరా ఆధారంగా నీవు గ్రహించినది ఏమిటి?

.......................................................................................................................................

ఉ) కింది పదాలను చదవండి. గేయం ఆధారంగా వాటిని జతపరచి రాయండి.

| | |
|---|---|
| తిండి కలిగితే | చెప్పుకోకోయ్ |
| ఒట్టి మాటలు | కండకలదోయ్ |
| ఒట్టి గొప్పలు | తోడుపడవోయ్ |
| పొరుగు వారికి | పట్టుకొని |
| చెట్టపట్టాల్ | కట్టిపెట్టోయ్ |



ఉదా॥ తిండి కలిగితే కండకలదోయ్

1. ..........................................................

2. ..........................................................

3. ..........................................................

4. ..........................................................



## పదజాలం

అ) గేయంలో కింది వత్తులు ఉన్న పదాలను గుర్తించి రాయండి.

| ్న | ్ట | ్త | ్ప | ్వ | ్ర |
|---|---|---|---|---|---|

ఉదా॥ పెంచుమన్నా మతములన్నీ ................ ................

................ ................ ................ ................

ఆ) గేయం ఆధారంగా పట్టికను పూరించండి.

| | గుణింత పదాలు | ద్విత్వాక్షర పదాలు | సంయుక్తాక్షర పదాలు |
|---|---|---|---|
| ఉదా॥ | మంచి | ఒట్టి | పొంగిపొర్లే |
| | | | |
| | | | |
| | | | |
| | | | |

ఇ) కింది గళ్ళలో పాఠంలోని పదాలు దాగి ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి. వాటిని ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఒ | పెం | చు | మ | న్నా |
| ట్టి | పొం | గొ | ప్ప | లు |
| మా | గి | పొ | రు | గు |
| ట | పొ | మ | త | ము |
| లు | ర్లే | దే | శ | ము |

ఉదా॥ 1. దేశము ........................

2. ........................

3. ........................

4. ........................

5. ........................

6. ........................



ఉదా॥ 1. భారతదేశం అతి ప్రాచీన దేశం. ........................

2. ........................

3. ........................

4. ........................

5. ........................

6. ........................

ఈ) కింది పదాలు చదవండి.

| ఏకవచన పదాలు | బహువచన పదాలు | ఏకవచన పదాలు | బహువచన పదాలు |
|---|---|---|---|
| మాట | మాటలు | చిత్రం | చిత్రాలు |
| చెట్టు | చెట్లు | మతం | మతాలు |
| బండి | బళ్ళు | లాభం | లాభాలు |
| జాతి | జాతులు | నాయకుడు | నాయకులు |

ఉ) కింది ఖాళీలను సరైన పదంతో నింపండి.

| ఏకవచన పదాలు | బహువచన పదాలు | ఏకవచన పదాలు | బహువచన పదాలు |
|---|---|---|---|
| వందనం | | ఆట | |
| దేశం | | | చీమలు |
| | బస్సులు | బాణం | |
| ఊరు | | | బంతులు |

ఊ) మీ పాఠశాలలో జరుపుకునే ఉత్సవాలు రాయండి. ఆ ఉత్సవాలను తెలిపే పదాలతో వాక్యాలు రాయండి.

ఉదా॥ 1. స్వాతంత్ర్యదినోత్సవం

మా పాఠశాలలో ఆగష్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం ఘనంగా జరుపుకున్నాము.

2. ............................

..........................................................................................................

3. ............................

..........................................................................................................

4. ............................

..........................................................................................................

5. ............................

..........................................................................................................



## స్వీయరచన



1. దేశభక్తిని ఎలా చాటాలి?
2. "తిండి కలిగితె కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్". గేయ పాదం ద్వారా మీరేమి తెలుసుకున్నారు?
3. భారతావనిలో ప్రజలందరూ సోదర భావంతో ఉండాలనే భావాన్ని తెలుపుతూ కొన్ని వాక్యాలు రాయండి.

## సృజనాత్మకత



అ) కింది గేయాన్ని పొడిగించండి.

వందనం వందనం
గాంధీ తాతకు వందనం
వందనం వందనం
చాచా నెహ్రూకు వందనం

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

ఆ) గేయం ఆధారంగా కొన్ని నినాదాలు రాయండి.

దేశంలో ప్రజలంతా
అన్నదమ్ముల్లా ఉండాలి.

మాటలకన్నా చేతలు మిన్న.



## ప్రాజెక్టు పని

దేశనాయకుల చిత్రాలు సేకరించండి. వాటిని తరగతిగదిలో ప్రదర్శించండి.

## భాషాంశాలు

అ) కింది వాక్యాలు చదవండి. (?) ఈ గుర్తుకు '◯' చుట్టండి.



1. ఆంధ్రా యూనివర్శిటీకి వెళ్ళాలంటే ఏ నెంబర్ బస్ ఎక్కాలి?
2. భీమిలి వెళ్ళే దారిలోనే రామకృష్ణ బీచ్ వస్తుందా?
3. లైట్‌హౌస్‌కు వెళ్ళాలంటే ఆటో ఎక్కడ దొరుకుతుంది?
4. విమానాశ్రయానికి చేరుకోవాలంటే బస్సులుంటాయా?

5. విశాఖపట్నంలో బస చేయటానికి అనువైన ప్రదేశం ఏది?


6. రైల్ నిలయంలో 'రిజర్వేషన్ కౌంటర్' ఎటువైపు ఉంటుంది?

పిల్లలూ! ఈ గుర్తు (?) వాక్యంలో ఎక్కడ ఉందో గుర్తించారు కదా! ఈ గుర్తును (?) 'ప్రశ్నార్థక చిహ్నం' అంటారు. అలాగే ఎప్పుడు, ఎక్కడ, ఏ, ఏది, ఎటువైపు లాంటి పదాలను కూడా ఉపయోగించాం. ఇలాంటి ప్రశ్నార్థక పదాలు, ప్రశ్నార్థక గుర్తు కలిగిన వాక్యాలను "ప్రశ్నార్థక వాక్యాలు" అంటారు.

**అ) కింది వాక్యాలను గమనించండి. వీటిలో ప్రశ్నార్థక పదాలను గుర్తించి గీత గీయండి.**

ఉదా॥ నీ పేరు ఏమిటి?

- మీరు బడినుండి ఎప్పుడు వచ్చారు?
- మీరు ఎట్లా చదువుతున్నారు?
- మీ దగ్గర ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?
- మీరు ఏ ఊరిలో ఉంటున్నారు?
- జాతీయగీతం రాసినవారు ఎవరు?



**ఇ) కింది ప్రశ్నార్థక పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

1. ఎవరు? ..........................................................
2. ఏమిటి? ..........................................................
3. ఎలా? ..........................................................
4. ఎందుకు? ..........................................................
5. ఎప్పుడు? ..........................................................
6. ఏది? ..........................................................
7. ఎన్ని? ..........................................................
8. ఎక్కడ? ..........................................................
9. ఏ ..........................................................



ఈ మాసపు పాట

# తెలుగు తల్లీ



తేనె పలుకుల తెలుగు తల్లీ!
రవల వెలుగుల తెలుగు తల్లీ!
శాతవాహన శకములోపల
శాంతి పాఠము నేర్పితమ్మా! || తేనె ||

పూర్వ వేంగీ యుగములోపల
పుణ్యకవితల జెప్పితమ్మా!
కాకతీయుల కాలమందూ
ఖడ్గ పాండితి గరపితమ్మా! || తేనె ||

రెడ్డిరాయల రాజ్యమందూ
లలిత కళలను దేల్చితమ్మా!
గాంధి దేవుని యుగములోపల
సదయ హృదయుల గాంచితమ్మా || ||

సర్వమానవ సమతగూర్పగ
భారతాంబకు యశమునింపగ
కదలిరమ్మో తెలుగుతల్లీ
బ్రోవరమ్మో తెలుగుతల్లీ || ||

కవి పరిచయం

## పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు

(7-5-1921 - 13-9-1989)

పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు విమర్శకుడు, కవి. సాహిత్యవ్యాసాలు, కథలు, ఏకాంకికలు, ఖండకావ్యాలు రచించారు. వీరి రచనల్లో సాహిత్యసంపద, ఆంధ్రాభ్యుదయం, కాపు పాటలు ముఖ్యమైనవి.

ఈ మాసపు కథ

# కందిరీగ కిటుకు

-రావూరి భరద్వాజ



అనగా అనగా ఓ పెద్ద అడవి. ఆ అడవిలో రకరకాల జంతువులు ఉన్నాయి. ఆ అడవికి ఓ సింహం రాజుగా ఉంటున్నది. నిజానికి ఆ సింహం చాలా మంచిది. తనను చూసి మిగిలిన జంతువులు భయపడడం ఆ సింహానికి ఇష్టం లేదు. ప్రతివారూ తన దగ్గరకు రావాలనీ, వారి వారి బాధలు తనతో చెప్పుకోవాలనీ సింహం అభిప్రాయం. సింహం కూడా మారువేషంతో అప్పుడప్పుడు అడవిలో తిరుగుతూ ఉండేది.

అలా తిరగడంలో ఓ ఏనుగు తటస్థపడింది. ఈ ఏనుగు కూడా తెలివైనదే. కాని దాని గుణం అట్టే మంచి కాదు. మరొకరు సుఖంగా ఉండటం, హాయిగా నవ్వుకోవడం ఆ ఏనుగుకు గిట్టదు.

వచ్చినప్పట్నించీ అది సింహంతో పొత్తు కలపాలని చూస్తూనే ఉన్నది? సింహం మారువేషంతో తిరుగుతున్నప్పుడు. ఏనుగు పసిగట్టి సింహంతో కబుర్లాడింది. మాటలు పెంచింది. స్నేహం చేసింది. ఆ స్నేహం బాగా పెంచేసింది కూడా. సింహం మంచిదనుకొన్నాం గదా! అంచేత దానికి ఎదుటివారి చెడ్డగుణాలు ఒకంతట తెలిసేవి కావు. అందరూ మంచివారే అనుకునేది సింహం. అందరి మాటలూ నమ్మేది పాపం.

ఏనుగు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఇతర జంతువుల మీద చాడీలు చెప్పేది. అబద్ధాలాడేది. చివరికి సింహాన్ని తన చేతిలో చిక్కించుకొన్నది. సింహానికి ఏనుగు ఎంత చెబితే అంత! ఈ ఆసరా చూసుకొని ఏనుగు మిగిలిన జంతువులను వేధించుకు తినేది. భయపెట్టేది. బెదరకొట్టేది. జంతువులు చాలా కాలం ఈ బాధను భరించాయి. ఏం చేయడానికీ వాటికి తోచలేదు. చివరికి అడవిని విడిచి వెడదామనుకొన్నాయి కూడా.

ఆ దశలో ఒక కందిరీగ, ఏనుగు పనేదో తను చూస్తానన్నది. అని, మెల్లగా ఏనుగు దగ్గరకెళ్ళి చెవిలో దూరిపోయింది. ఈ కందిరీగను వదిలించుకోవడానికి ఏనుగు చాలా ప్రయత్నించింది. పెద్దగా ఘీంకరించింది. కోపంతో చెట్లను కొమ్మలను విరిచేసింది. చేతికందిన జంతువుల మీద విరుచుకు పడింది. కానీ కందిరీగ వదలలేదు.

ఆఖరుకు ఏనుగు విసుగెత్తిపోయి కందిరీగతో రాజీకి వచ్చింది. ఏనుగు ఈ అడవిని విడిచిపోతే, తను ఏనుగును విడిచిపోతానన్నది కందిరీగ. ఇక చేసేదేమీ లేక ఏనుగు ఆ అడవిని విడిచి వెళ్ళిపోయింది.

G4I8J2

## కవి పరిచయం

**రావూరి భరద్వాజ (5.7.1927 - 18.10.2013)**



గుంటూరు జిల్లా తాడికొండలో జన్మించారు. 'విమల' ఈయన రాసిన తొలి కథ. 'అపరిచితులు', 'కథాసాగరము' వంటి 37 కథా సంపుటాలు, 'ఉడుతమ్మ ఉపదేశం', 'కీలుగుర్రం' వంటి 43 పిల్లల కథలు, 'కర్రిమింగిన వెలగపండు', 'జల ప్రళయం' వంటి 17 నవలలు రాశారు. వీరి 'పాకుడు రాళ్లు' నవలకు జ్ఞానపీఠ పురస్కారం వరించింది.

జ్ఞానపీఠ పురస్కారం, కళా ప్రపూర్ణ , కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, సోవియెట్ భూమి నెహ్రూ పురస్కారం, రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారం, కళారత్న (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం), లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం వంటివి పొందారు.

# 4 పరివర్తన

## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి



1. చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
2. మీకు తెలిసిన ఆటల గురించి చెప్పండి.

## కవి పరిచయం

### వెంకట పార్వతీశ కవులు



**బాలాంత్రపు వెంకటరావు**

**జననం:1882 మరణం:1955**

**తల్లిదండ్రులు** : సూరమ్మ, వెంకట నరసింహం

**జన్మస్థలం** : మల్లాము, తూర్పుగోదావరి జిల్లా

**ఓలేటి పార్వతీశం**

**జననం:1880 మరణం:1970**

**తల్లిదండ్రులు** : వెంకమ్మ, అచ్యుతరామయ్య

**జన్మస్థలం** : పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా



# పరివర్తన

ఆ అబ్బాయి పేరు రాము. ఆటలంటే అతనికి ఇష్టం. రాము తండ్రి ఊళ్ళో బాగా డబ్బున్న వ్యక్తి. పెద్ద ఇల్లు కూడా ఉంది. ఆ ఇంట్లో రాము చదువుకోవడానికి ఒక గది కూడా ఉంది.

రాముకు బద్ధకం ఎక్కువ. చదువంటే శ్రద్ధ తక్కువ. గదిలో పుస్తకాలు ఎక్కడివక్కడ చిందర వందరగా పడేస్తాడు. ఆరోజు ఆలస్యంగా నిద్ర లేచాడు.

ఇంతలో వంట గదిలోనుంచి వాళ్ల అమ్మ గొంతు వినిపించింది. "బాబూ! రాము! చుట్టుపక్కల పిల్లలు అందరూ బడికి వెళ్ళిపోతున్నారు. నువ్వు కూడా త్వరగా తయారయ్యి బడికి వెళ్ళు" అంది.


కాసేపటి తర్వాత పుస్తకాల సంచి భుజానికి తగిలించుకొని బయలుదేరాడు. కొంత దూరం నడిచే సరికి దారిలో ఉన్న మామిడి తోటలోకి వెళ్ళాలి అనిపించింది. వెంటనే దారి మళ్ళాడు రాము.



మామిడి తోటకు చేరుకున్నాడు. పారుతున్న నీళ్ళ గలగలలు, పక్షుల కిలకిలలు, వాటి రెక్కల టపటపలతో పచ్చని ప్రకృతి ఆహ్లాదంగా ఉంది.

రాముకు ఎంతో సంతోషంగా ఉంది. అక్కడున్న పక్షులతో ఆడుకోవాలి అనిపించింది. చెట్టు కొమ్మపైన కాకి కన్పించింది 'కాకీ! కాకీ! మనం ఆడుకుందామా?' అని అడిగాడు.

దానికి కాకి 'అయ్యో బాబూ! రానున్నది వానాకాలం. అసలే నాకు గూడు లేదు. ఒక్కొక్క పుల్లను తెచ్చుకొని శ్రమించి గూడు కట్టుకుంటున్నాను. నీతో ఆడడం కుదరదు' అని చెప్పి ఎగిరిపోయింది. రాము చిన్నబుచ్చుకున్నాడు.



ఇంతలో అక్కడున్న పువ్వులపై వాలుతున్న తేనెటీగ కనిపించింది. రాము ముఖంలో ఆనందం. తేనెటీగను పలకరించాడు. 'తేనెటీగా! తేనెటీగా! మనం ఆడుకుందామా!' అని ఆసక్తిగా అడిగాడు.

రాము మాటల్ని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూనే "నాకు అంత తీరిక లేదు బాబూ! పూలనుంచి తేనెను సేకరిస్తున్నాను. పూలు తొందరగా వాడిపోతాయి. నాకు చాలా చాలా పని ఉంది" అని తుమ్మెద ఎగిరిపోయింది.

రాము దిగులు పడ్డాడు. ఇంతలో ఎదురుగా చీమ కన్పించింది. 'చీమా! చీమా! మనం ఆడుకుందామా!' అని ఆత్రంగా అడిగాడు.



"బాబూ! ఇది నేను గింజలు సేకరించుకునే కాలం. ఇప్పుడు సేకరించుకోకపోతే, రానున్నది వానా కాలం. అప్పుడేం తింటాం? ఇప్పుడు కష్టపడి గింజలు సేకరించి దాచుకుంటే అప్పుడు సుఖంగా ఉండొచ్చు" అంటూ గింజను మోసుకుని పోయింది.



అదేమిటి! నాతో ఎవరూ ఆడుకోటానికి రావటం లేదు అని రాము అక్కడే కూర్చొని ఆలోచించసాగాడు. 'కాకి, తేనెటీగ, చీమ వాటి పనిలో అవి ఉన్నాయి కదా! నాకిప్పుడు ఉన్న పని బడికి వెళ్ళి చదువుకోవడమే కదా? నేనెందుకు బడికి వెళ్ళకుండా ఇలా వ్యర్థంగా తిరుగుతున్నాను. నేను బడికి వెళతాను' అని అనుకున్నాడు. వెంటనే కింద పడి వున్న పుస్తకాల సంచిని ఇష్టంగా చేతిలోకి తీసుకున్నాడు. మళ్ళీ బడికి వెళ్ళే దారిలోకి వచ్చాడు. ఎదురుగా బడి ఆత్మీయంగా కనిపిస్తోంది.

## పదాలు-అర్థాలు

| | | | |
|---|---|---|---|
| పరివర్తన | = మార్పు | ఆసక్తిగా | = ఇష్టంగా |
| చిందర వందర | = క్రమపద్ధతిలో లేకపోవడం | ఆత్మీయంగా | = ప్రేమగా |
| ఆహ్లాదంగా | = సంతోషంగా | చిన్నబుచ్చుకొను | = నిరాశపడు |

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం

1. పరివర్తన కథను సొంత మాటల్లో చెప్పండి?
2. రాము మామిడితోటలో ఎవరెవరితో మాట్లాడాడు?
3. కాకి, తేనెటీగ, చీమలు రాముతో ఆడుకోవటానికి ఎందుకు రానన్నాయి?
4. బడికి వెళ్ళే సమయంలో ఆట ఆడుకోవడానికి రమ్మని నీ స్నేహితులు పిలిస్తే నీవేమంటావు?

### చదవడం - వ్యక్తపరచడం

అ) కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.



రాము బడికి వెళ్ళకుండా తోటలోకి ఆడుకోవడానికి వెళ్ళాడు. అక్కడ కాకి, చీమలు కనిపించాయి. "కాకి! కాకి! మనం ఆడుకుందామా!" అని అడిగాడు. దానికి కాకి "అయ్యోబాబూ! రానున్నది వానాకాలం. అసలే నాకు గూడులేదు. ఒక్కొక్క పుల్లను తెచ్చుకొని శ్రమించి గూడు కట్టుకుంటున్నాను. నాకు చాలా పని ఉంది! నీతో ఆడడం కుదరదు' అని ఎగిరిపోయింది. "చీమా! చీమా! మనం ఆడుకుందామా!" అని ఆత్రంగా అడిగాడు. "బాబు! రానున్నది వానాకాలం ఇప్పుడు గింజ సేకరించుకోక పోతే, రాబోయే కాలంలో సుఖపడలేము" అని గింజను మోసుకుపోయింది. అదేంటి నాతో ఎవరూ ఆడుకోవడానికి రావడంలేదని రాము ఆలోచించసాగాడు?

1. కాకి, చీమ రాముతో ఆడుకోవడానికి ఇష్టపడ్డాయా? ఎందుకు?

......................................................................................................

2. కాకి, చీమ రాబోయే ఏ కాలం కోసం భయపడుతున్నాయి? ఎందుకు?

......................................................................................................

3. 'ఆత్రం'గా పదానికి అర్థం రాయండి.

..............................................................................................

4. రాముతో కాకి, చీమ ఆటలు ఆడుతూ కాలం గడిపేస్తే ఏమవుతుంది?

..............................................................................................

5. కాకి, చీమ మాటలు ద్వారా రాము ఏమి ఆలోచించి ఉంటాడు?

..............................................................................................

**ఆ) పాఠంలోని అనుకరణ పదాలు గుర్తించి రాయండి, ఇలాంటి మరికొన్ని పదాలు రాయండి.**

ఉదా॥ గల గల.

................ ................ ................

................ ................ ................

................ ................ ................

**ఇ) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయండి.**



రామాపురంలో రాజు అనే బాలుడు ఉండేవాడు. ఎప్పుడూ కబుర్లు, ఆటలు అంటూ కాలక్షేపం చేసేవాడు. బాల్యంలో చదువు పట్ల అశ్రద్ధగా ఉండేవాడు. అలాగే పెద్దవాడయ్యాకా పనిపట్ల శ్రద్ధ పెట్టేవాడు కాదు. తన తోటివారు అందరూ పనిచేసి డబ్బులు కూడ పెడుతుంటే తను ఏ పని చేయలేకపోవడం రాజును బాధపెట్టింది. "ఏపనైనా శ్రద్ధగా చెయ్యాలి. అప్పుడే విజయం చేకూరుతుంది" అని చిన్నప్పుడు గురువు గారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి పని పట్ల శ్రద్ధ పెట్టాడు. అందరిలాగే తనూ సంపాదనాపరుడయ్యాడు.

1. రాజు కాలాన్ని ఎలా గడిపేవాడు?

..............................................................................................

2. రాజు గురువుగారు చిన్నప్పుడు ఏమని చెప్పేవారు?

..............................................................................................

3. 'కాలక్షేపం' ఈ పదానికి అర్థం రాయండి.

..............................................................................................

## పదజాలం

అ) కింది పదాలు చదవండి. జతపరచండి. ఏవైనా రెండు పదాలు ఉపయోగించి వాక్యాలు రాయండి.

| | | |
|---|---|---|
| గలగల | వానచినుకులు | 1. పకపక నవ్వడం |
| చకచక | సెలయేరు | 2. ............................ |
| పకపక | ఏడవడం | 3. ............................ |
| వలవల | నవ్వడం | 4. ............................ |
| టపటప | నడవడం | 5. ............................ |

ఉదా॥ బుజ్జాయి పకపక నవ్వుతున్నది.



1. ............................................................
2. ............................................................
3. ............................................................
4. ............................................................

ఆ) మీరు చూసిన పూలమొక్కల పేర్ల జాబితా రాయండి.

ఉదా॥ గులాబీ మొక్క ............... ............... ...............

............... ............... ............... ...............

ఇ) కింది పదాలను చదవండి. వేరుగా ఉన్నవాటి కింద గీత గీయండి.



1. కాకి, కోయిల, పాము, పిచుక
2. బొద్దింక, చీమ, ఈగ, ఏనుగు
3. కుక్క, పిల్లి, దోమ, గేదె
4. గులాబీ, టమాట, బెండకాయ, పొట్లకాయ

ఈ) పాఠంలో సంయుక్తాక్షర పదాలు గుర్తించండి. రాయండి.

ఉదా॥ ఆలస్యంగా ............... ............... ...............

............... ............... ............... ...............

## స్వీయరచన

1. రాము వెళ్ళిన మామిడి తోట ఎలా ఉంది?
2. కాకి, తేనెటీగ, చీమల ద్వారా రాము ఏమి గ్రహించాడు?
3. ముందు జాగ్రత్త లేకుండా కాలం గడిపేస్తే ఏమవుతుందో రాయండి.

## సృజనాత్మకత

**ఖాళీలలో సరైన పదాన్ని ఉంచి కథను ఊహించి రాయండి**

ఒకరోజు కాకికి ............ ముక్క దొరికింది.
అది నక్క చూచి, ఆ ముక్కను ............ అనుకుంది.
కాకిని బాగా .............
కాకి పొంగిపోయి ............ అన్నది. కాకి నోటిలో
ముక్క .............
నక్క ............ తీసుకొని చక్కా పోయింది.



..........................................................................

..........................................................................


..........................................................................

..........................................................................

..........................................................................

## ప్రశంస

అందరికి చదువు అవసరం. తరగతి పుస్తకాలు చదవడం వల్ల, వార్తా పత్రికలు చదవడం వల్ల, గ్రంథాలయ పుస్తకాలు చదవడం వల్ల మనకు తెలివితేటలు పెరుగుతాయి. మీ తరగతిలో బాగా చదివే పిల్లల్ని అభినందించండి.



## భాషాంశాలు

అ) కింది పేరాను చదవండి. ( . ,) గుర్తులను సరైన చోట గుర్తించండి. అలాగే నామవాచక, సర్వనామ పదాలు గుర్తించండి. పట్టికలో రాయండి.




రఘు వర్షిణి ఆయేషా ఆసిఫ్ మీరా హర్షిత మేరీ సంతోష్ జంతు ప్రదర్శనశాలకు వెళ్ళారు వాళ్ళు అక్కడ సింహం పులి ఏనుగు జిరాఫీ కోతి నెమలి రామచిలుక పావురం నిప్పుకోడి మొదలైన జంతువులను పక్షులను చూశారు వారందరూ వాటిని చూసి ఆనందించారు జంతు ప్రదర్శనశాల ముందు ఉన్న బండిపై జామ బత్తాయి అరటిపండ్లు చూశారు అవి కొని తిన్నారు ఆటో ఎక్కి ఇంటికి వచ్చారు.

| నామవాచకాలు | | | | సర్వనామాలు |
|---|---|---|---|---|
| మనుషులు | జంతువులు | పక్షులు | ఇతరములు | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |

ఆ) పాఠంలో ( . ,) గుర్తుల ముందున్న పదాలు గుర్తించి రాయండి.

( . ) గుర్తుకు ముందున్న పదాలు .............. .............. ..............

.............. .............. ..............

( , ) గుర్తుకు ముందున్న పదాలు .............. .............. ..............

.............. .............. ..............



ఈ మాసపు పాట

# పడవ నడపవోయి



ప॥ పడవనడపవోయి పూలపడవ నడపవోయి

చ॥ చుట్టినతెరచాపనెత్తి
గట్టిగ చుక్కానిపట్టి
ఒరగనీక సురగనీక
తరగలపై తేలిపోవ
ప॥

చ॥ చక్కని రాయంచనంచు
చుక్కల తళుకెంచుకొంచు
మిన్నుమన్ను కలుపుచున్న
కన్నులలో సాగునంట
ప॥

చ॥ ఊరుదాటి ఏరుదాటి
కడలినాల్గు కడలను దాటి
చీకుచింతలేని వింత
లోకానికి చేరునంట
ప॥

## కవి పరిచయం

### వింజమూరి శివరామారావు

జననం : 1908 మరణం : 1982



ఈయన తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం దగ్గర చంద్రపాలెం గ్రామంలో జన్మించారు. ప్రముఖ కవి, రచయిత, ఆకాశవాణి కళాకారులు. ఈయన రచనలు 'గోర్కి కథలు', 'కల్పవల్లి' ఖండకావ్య సంపుటి మొదలైనవి. ఈయన బిరుదు కళాప్రపూర్ణ.

# ఉపాయం



పిల్లలూ! మన తెలివితేటలు మనకు మంచి కీర్తి, ప్రతిష్ఠలు అందిస్తాయి. మనకు సమాజంలో మంచి పేరును తెస్తాయి. ఇలాంటి కథను మనం తెలుసుకుందాం.

పూర్వం భరతవంశానికి చెందిన రాకుమారులు అందరూ కలసి సరదాగా బంతి ఆట ఆడుకుంటున్నారు. ఒకరి తరువాత ఒకరు బంతిని తంతున్నారు. అట్లా బంతి భీముడి దగ్గరకు వచ్చింది. భీముడు బంతిని గట్టిగా తన్నాడు. దెబ్బకి బంతి పైకి ఎగిరి అల్లంతదూరాన ఉన్న బావిలో పడింది. అందరూ ఆ నూతి చుట్టూ చేరి బంతిని పైకి తీయటానికి ప్రయత్నించారు. చివరకు సాధ్యం కాదని బిక్కమొహం వేశారు.

ఇంతలో ఆ దారిన పోతున్న ఒక వ్యక్తి రాకుమారులను చూసి, విషయం అడిగి తెలుసుకున్నాడు. అతను చాలా సన్నగా పీలగా, బాణాలు పట్టుకుని ఉన్నాడు. ఆ వ్యక్తి అక్కడ ఉన్నవారంతా రాకుమారులని గ్రహించాడు. "మీరంతా విలువిద్యలో ఆరితేరిన రాకుమారుల్లా ఉన్నారు. బంతిని ఎలా తియ్యాలో తెలియడం లేదా?" అని ఆశ్చర్యంతో అడిగాడు.

రాకుమారులందరూ తెలియదు అన్నట్లుగా తలలూపారు. అయితే చూడండి అంటూ విల్లు అందుకొని ఒక బాణాన్ని నేరుగా బంతికి తాకేలా వేశాడు. ఆ బాణానికి తాకేలా మరొక బాణం వేశాడు. అట్లా ఒక బాణం తరువాత మరొక బాణం వదిలాడు. అట్లా బాణాల గొలుసు తయారయింది. దాంతో బంతిని పైకి లాగి రాకుమారులకు అందించాడు.

H8V4P3




ఇంతలో విషయం తెలుసుకున్న భీష్ముడు అక్కడికి చేరుకున్నాడు. అక్కడున్న ఆ వ్యక్తి విలువిద్యలో గొప్ప గురువు ద్రోణాచార్యుడు అని తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. ఆయన అప్పటికే ద్రోణుని ప్రతిభ గూర్చి విని ఉన్నాడు. వెంటనే ద్రోణాచార్యునికి నమస్కరించి "మీవంటి గొప్పవారు మా చిరంజీవులకు తారసపడడం మా పూర్వ జన్మ సుకృతం. ఈ పిల్లలు మా మనుమలు. వీరిని మీ శిష్యులుగా స్వీకరించి విలువిద్య నేర్పండి" అన్నాడు.

ద్రోణుడు అంగీకరించగానే అర్జునుడు పరుగున వచ్చి ద్రోణునికి పాదాభివందనం చేశాడు. ఆ విధంగా ద్రోణుడు భరతవంశీయులకు విలువిద్య గురువుగా ప్రసిద్ధి కెక్కాడు.

పిల్లలూ! మన ప్రతిభా పాటవాలే మనల్ని ఉన్నత స్థాయికి చేరుస్తాయి అని గ్రహించారు కదా!

# 5 సత్య మహిమ

## చిత్రం చూడండి – ఆలోచించి మాట్లాడండి



1. చిత్రంలో ఏమేమి ఉన్నాయి?
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?
3. చిత్రంలో పిల్లలు ఏమి చేస్తున్నారు?


### కవి పరిచయం



**అవధాని రమేష్** కాలం : 20వ శతాబ్దం

ఈ గేయకథ అవధాని రమేష్‌గారి రచన 'గుజ్జనగూళ్ళు' నుండి తీసుకోబడింది. ఈయన ఆంధ్ర రాష్ట్రంలోని కర్నూలు జిల్లా అవుకు అగ్రహారంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యశాస్త్రి, సావిత్రమ్మ. ఈయన రచనలు 'కాసులపేరు', 'ప్రతీకారం', 'మూడు మంచి కథలు'.

# సత్య మహిమ



ఒక పల్లెటూరిలో
అకలంక చరితుండు
ఆదర్శమాలిన
బీదవా డొకడుండు

కట్టెలతో వాడు
పొట్ట నింపుకొనుచు
సత్య వ్రతంబుతో
నిత్యంబు జీవించు,

ఒక నాడు వాడడవి
ఒక చెట్టు కొట్టుచో
గొడ్డలి చేజారి
పడ్డది నీటిలోన,

అయ్యయ్యో! దైవమా!
అయ్యొ కుయ్యొ మొర్రో
నా గొడ్డలే పోయె
నా గతి యింకేమి?

మా నాన్న వస్తాడు
మాకేమో తెస్తాడు
మరి గంజి పోస్తాడు
మమ్ము బ్రతికిస్తాడు

అనుచు తెన్నులు చూచి
కనులొప్ప చెప్పేటి
నా ముద్దు బిడ్డల
మోమెట్లు కనుగొందు?

ఉత్త చేతుల బోయి
తత్తరం బెటు దీర్తు
పిల్లల కడుపగ్గి
చల్లారు నెటు తగ్గి

యీ ఆర్తి యినుమడి
నే దీర్తు నదిపడి
కనివాని దీనత
ఆ నదీ దేవత

చెన్నారు కరుణతో
అన్నాయనుచు బిల్చి
రంగారు వన్నెల
బంగారు గొడ్డలి

చూపి నీదేనేమొ
చూడుమా యని పల్కె
మిరుమిట్లు గొలుపుచు
మెరసెడి గొడ్డలి



తిలకించి యతడనె
తల చేతులాడించి
అది నాది కాదమ్మ
అది నాది కాదు

నాది కానిది నేను
మది కోరనోయమ్మ,
ఈ మొగంబుల కేమి?
ఈ మిసిమి పసలేమి?

వెంటనే ఆ దేవి
వెండి గొడ్డలి చూప
అది గూడ నాది కా
దని వాడు తల త్రిప్పె!



ఇనుపగొడ్డలి తీసి
ఇది చూడుమా యన్న
వాడు నాదే యంచు
వేడె తన కిమ్మంచు,

వాని సత్యానికి
వాని ధర్మానికి
వాని నిరాశకు
ఆ దేవి కరుణించి,

బంగారు గొడ్డలిని
వెండి గొడ్డలియును
బహుమానముగ నిచ్చి
పంపించె దీవించి.

## పదాలు-అర్థాలు

| | |
|---|---|
| మహిమ | = గొప్పతనం |
| అకలంక | = మచ్చలేని, చెడుగుణాలు లేనట్టి |
| చరితుండు | = చరిత్ర కలవాడు; ప్రవర్తన కలవాడు |
| సత్యవ్రతంబు | = ఎల్లవేళలా నిజం చెప్పే వ్రతం |
| నిత్యంబు | = ఎల్లప్పుడు |
| గతి | = జీవితం గడిచే విధానం |
| తెన్నులు చూచి | = ఎదురు చూసి |
| మోము | = ముఖం |
| తత్తరం | = గాబరా |
| ఆర్తి | = దుఃఖం |
| కని | = చూసి |
| దీనత | = దారిద్ర్యం |
| కరుణ | = దయ, జాలి |
| మిరుమిట్లు | = మెరుగులు |
| తిలకించి | = చూసి |
| మది | = మనసు, బుద్ధి |
| మొగంబు | = ముఖం |
| మిసిమి | = నూతన కాంతి |
| బహుమానం | = కానుక |
| వన్నె | = అందం; రంగు |
| చెన్ను | = అందం |

## భావం

ఒక పల్లెటూరిలో కల్లాకపటం లేని ఒక బీదవాడు ఉండేవాడు. అతను కట్టెలు కొట్టి అమ్ముకొని సత్యాన్ని చక్కగా పాటిస్తూ జీవించేవాడు. ఒక రోజు అతను అడవిలో నది ఒడ్డున చెట్టు కొడుతుంటే గొడ్డలి చేతిలో నుంచి జారి నీటిలో పడింది.

అయ్యో! దేవుడా! నా గొడ్డలి నీళ్ళల్లో పడింది. నేనెట్లా బతకాలి. "నాన్న డబ్బులు తెస్తాడు, అమ్మ వంటచేసి మాకు పెడుతుంది అని నా పిల్లలు ఎదురుచూస్తూ ఉంటారు. నేను వట్టిచేతులతో వెళ్తే వారికి ఆకలి ఎలా తీరుతుంది?" అని బాధపడ్డాడు.

అతని బాధ చూసి నదీదేవతకు మనస్సు కరిగింది. సాయం చేయాలనుకొని ఆ నదిలో ప్రత్యక్షం అయింది. నదిలోనుంచి ఒక బంగారు గొడ్డలి తీసింది. "ఈ గొడ్డలి నీదా?" అని అడిగింది. అతను "కాదమ్మా! ఇది నాది కాదు. నా వంటి పేదవానికి బంగారు గొడ్డలి ఎందుకుంటుంది?" అని చెప్పాడు. దేవత మళ్ళీ నదిలోనుంచి ఒక వెండి గొడ్డలి తీసింది. "ఈ గొడ్డలి నీదా"?

"కాదమ్మా, ఇది కూడా నాది కాదు" అని అతను బదులు చెప్పాడు.

దేవత ఇనుప గొడ్డలి తీసింది. "ఇది నీదా?" అని అడిగింది. "ఇదేనమ్మా నాది" అంటూ చేతులు జాపాడు.



నదీదేవత అతని నిజాయితీని మెచ్చుకుని, అతని ఇనుప గొడ్డలిని అతనికి ఇచ్చింది. అంతేకాకుండా బంగారు గొడ్డలినీ, వెండి గొడ్డలినీ కూడా అతనికి బహుమతిగా ఇచ్చి దీవించి పంపించింది.

# ఇవి చేయండి



## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
2. గేయ కథలో నదీదేవత ఏయే గొడ్డళ్లను ఇచ్చిందో చెప్పండి?
3. కట్టెలు కొట్టేవాడు బంగారు గొడ్డలి ఎందుకు తీసుకోలేదో చెప్పండి?
4. కట్టెలు కొట్టేవాడి స్థానంలో మీరుంటే ఏ గొడ్డలి తీసుకుంటారు? ఎందుకు?
5. కట్టెలు కొట్టేవాడిని మెచ్చుకున్న నదీదేవత బహుమతిగా ఏమి ఇచ్చింది?



## చదవడం - వ్యక్తపరచడం

**అ) కింది భావాలకి సరిపోయే గేయ భాగాలు గుర్తించి రాయండి.**

1. ఒక పల్లెలో నీతిమంతంగా ఏ ఆధారం లేకుండా బతికే పేదవాడున్నాడు.

   ..........................................................................................

2. నా గొడ్డలి పోయింది నేనెలా బతకాలి?

   ..........................................................................................

3. బంగారు గొడ్డలి చూపించి ఇది నీదేనేమో చూడు.

   ..........................................................................................

4. నాది కానిది నేను కోరను. నావంటి పేదవాడికి బంగారు గొడ్డలి ఎక్కడిది?

   ..........................................................................................

**ఆ) గేయాన్ని చదవండి, ఒత్తు పదాలను గుర్తించి రాయండి.**

- ఉదా॥సత్య వ్రతంబు .................. .................. .................. ..................

  .................. .................. .................. .................. ..................

ఇ) కింది గేయకథ పాదాలను సరైన క్రమంలో రాయండి.

నా ముద్దు బిడ్డల ______

అనుచు తెన్నులు చూచి ______

మోమెట్లు కనుగొందు ______

కనులొప్ప చెప్పేటి ______

ఈ) కింది గేయకథ పాదానికి భావాన్ని రాయండి.

బంగారు గొడ్డలిని ______

వెండి గొడ్డలియును ______

బహుమానముగా నిచ్చి ______

పంపించె దీవించి. ______

ఉ) కింది పదాలను సరైన ప్రదేశంలో రాయండి.

మేత పాలిచ్చి మెలగాలో పంజా తల్లిని సత్యసంధత లేగదూడ

ఒక ఊరిలో ఒక ఆవు ఉండేది. అది సాధుజంతువు. ఒకనాడు ఆ ఆవు అడవిలో ........... మేస్తుండగా, ఆకలితో ఉన్న పులికంట బడింది. ఆవును చూడగానే ఒక్కసారిగా ................ విసరబోయింది. అప్పుడు ఆవు తనకో .............. ఉందని బుద్ధులు నేర్పి వస్తానని ప్రాధేయపడింది. మొదట పులి ఒప్పుకోలేదు. చివరకు సరే నంది. ఆవు ఇంటికి వెళ్ళి బిడ్డకు ................ ఇతరులతో ఎలా ................. బుద్ధులు నేర్పి, పులి దగ్గరకు వెళ్తుంది. దూడ కూడా ................ అనుసరిస్తుంది. తల్లీబిడ్డల ప్రేమాభిమానాలు, ఆవు .................... కు పులి మెచ్చి వాటిని విడిచిపెట్టి, నీ బిడ్డతో హాయిగా బతకమని చెప్పింది.



ఊ) పై పేరా ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. ఆవు తన లేగదూడతో ఏమని చెప్పి ఉంటుంది? ______
2. ఆవుకు పులి ఎక్కడ ఎదుటపడింది? ______
3. పులి ఆవును ఎందుకు విడిచిపెట్టింది? ______

## పదజాలం

అ) గేయంలో ప్రాసపదాలను రాయండి.

నింపుకొనుచు – జీవించు

.................................. .................................. ..................................

.................................. .................................. ..................................

ఆ) కింది పదాలకు బహువచన రూపాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.



1. చెట్టు : చెట్లు

   ఉదా॥ మనం చెట్లను పెంచాలి.

2. బహుమానం : ..............................

   ..............................................................................................

3. దేవత : ..............................

   ..............................................................................................

4. పిల్లవాడు : ..............................

   ..............................................................................................

5. నది : ..............................

   ..............................................................................................

ఇ) కింది పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.

ఉదా॥ నిత్యము = ప్రతిరోజు

సూర్యుడు ప్రతి రోజు తూర్పున ఉదయిస్తాడు.

1. బీదవాడు : ..............................

   ..............................................................................................

2. పల్లెటూరు : ..............................

..............................................................................................................

3. మోము : ..............................

..............................................................................................................

4. తిలకించి : ..............................

..............................................................................................................

**ఈ) సత్యం పలకడం ఒక మంచి లక్షణం. అలాంటి మంచి లక్షణాలు కలిగి ఉండడం వలన మనం మంచివాళ్లుగా తయారవుతాము.**

కింది మంచి లక్షణాలు చదవండి. వీటిలో మీరు ఏ లక్షణాలు కలిగి ఉన్నారో వాటికి '✓' పెట్టండి.

| | | | |
|---|---|---|---|
| సత్యం పలకడం | ( ) | పెద్దలను గౌరవించడం | ( ) |
| హింసను విడనాడడం | ( ) | ఇతరులకు సాయం చేయడం | ( ) |
| నిజాయితీ కలిగి ఉండడం | ( ) | దయ కలిగి ఉండడం | ( ) |
| సమయ పాలన పాటించడం | ( ) | ఎప్పటి పని అప్పుడు పూర్తి చేయడం | ( ) |
| మర్యాదగా మాట్లాడడం | ( ) | పరిశుభ్రతను పాటించడం | ( ) |

**ఉ) కింది పదాల ఆధారాలతో కొత్త పదాన్ని కనుక్కోండి**

1. క్షీరాన్నం — పా □ □ ము
2. ఒక శరీర భాగం — పా □ ము
3. పుణ్యం కానిది — పా □ ము
4. ఒక పక్షి — పా □ □ ము
5. రాయి — పా □ □ ము
6. పక్క భాగం — పా □ ము
7. బెల్లంతో చేసేది — పా □ □ ము



## స్వీయరచన



అ) కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పేదవాడు ఎలాంటివాడో నాలుగు వాక్యాలు రాయండి.
2. నదీదేవత పేదవాడితో ఏమని పలికింది?
3. పేదవానికి నదీదేవత బహుమతిగా ఏమిచ్చింది?
4. గేయం ఆధారంగా "సత్యమహిమ" కథను సొంతమాటల్లో రాయండి.

## సృజనాత్మకత

ఆ) గేయం ఆధారంగా నదీదేవతకు, పేదవాడికి మధ్య జరిగిన సంభాషణలు రాయండి.

పేదవాడు : తల్లీ! నదీదేవతా! నా గొడ్డలి పోయిందమ్మా!

నదీదేవత : ఈ బంగారు గొడ్డలి నీదా?

పేదవాడు : ఇది నాది కాదమ్మా!

నదీదేవత : ..............................................................................

పేదవాడు : ..............................................................................

నదీదేవత : ..............................................................................

పేదవాడు : ..............................................................................

నదీదేవత : ..............................................................................

పేదవాడు : ..............................................................................

నదీదేవత : ..............................................................................

పేదవాడు : ..............................................................................

నదీదేవత : ..............................................................................

పేదవాడు : ..............................................................................



## ప్రాజెక్టు పని

మీ దగ్గరలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించి నీతికథలను సేకరించండి, మీ తరగతి గదిలో ప్రదర్శించండి.



## భాషాంశాలు

అ) కింది వాక్యాలు చదవండి.

| | |
|---|---|
| 1. రాజు, రాము తోటకు వెళ్ళారు. | 2. మామిడికాయలు కోసారు. |
| 3. ఇంటికి తెచ్చారు. | 4. అమ్మకు ఇచ్చారు. |

పై వాక్యాలలో వెళ్ళారు, కోసారు, తెచ్చారు, ఇచ్చారు లాంటి పదాలు పనులు జరగడాన్ని తెలియజేస్తున్నాయి. అలాంటి పదాలను **క్రియాపదాలు** అంటారు.

**కింది వాక్యాలలో క్రియాపదాలు గుర్తించి గీత గీయండి.**

1. మా నాన్న బొమ్మలు <u>కొన్నాడు.</u>
2. పిల్లలందరు ఆటలు ఆడారు.
3. అత్త ఉత్తరం రాసింది.
4. ప్రవల్లిక నాట్యం చేసింది.
5. తరుణ్ చిత్రం గీసాడు.
6. మురళి పాటలు పాడాడు.



అ) కింది ఖాళీలను క్రియాపదాలతో పూరించండి.

1. గీత కవితలు .....................
2. హర్షిత చిత్రాలు ...................
3. చంద్ర అన్నం .....................
4. రాబర్ట్ సైకిల్ .....................
5. అహ్మద్ ఈత .....................




ఈ మాసపు గేయం

# కన్నడ గేయం

– ఎన్.సి.ఇ.ఆర్.టి.
పాఠ్యపుస్తకం

ప॥
ఓ చెలువిన... ఆ ముద్దిన...
'చెలువిన ముద్దిన మక్కళే'
॥ఓ చెలు॥
మనెమనెయా అంగలదే
అరలిరువా హూవుగళే
నా ళె దినా నాడిదను 'నడెసువరు నీవుగళే'
॥ఓ చెలు॥
చ॥
తందె తాయి హేళిద రీతి నడెయలు బేకు
శాలెయ గురుగళు కలిసిద పాఠ కలియలు బేకు
దొడ్డవరల్లి భక్తిగౌరవ తోరలు బేకు
నడెనుడియల్లి 'సత్యవ ఎందు పాలిసబేకు'
॥ఓ చెలు॥
స్నేహితరల్లి ప్రీతియతోరి సోదరభావదినోడి
సోమారియాగదె కొట్టి హ కెలసవ తప్పదె మాడి
యారె ఆగలీ కష్టదల్లిద్దరే
సహాయ హస్తవ నీడి
భేదవ తొరెదు బారిలి
॥ఓ చెలు॥



**భావం :** ఓ అందమైన ముద్దులొలికే పాపల్లారా! ప్రతి ఇంట్లోనూ మీరు వికసిస్తూ ఉంటారు. రోజులు గడిచే కొద్దీ మీ అంతట మీరు నడవటం నేర్చుకుంటారు. తల్లిదండ్రులు చూపిన బాటలో, నేర్పిన రీతిలో నడుచుకుంటారు, అనుసరిస్తారు. గురువులు చెప్పిన పాఠాలను చక్కగా నేర్చుకుంటారు. పెద్దల పట్ల భక్తి, గౌరవం ప్రదర్శిస్తూ ఉంటారు. నిత్యం సత్యాన్నే పలుకుతూ సత్యమార్గంలోనే పయనిస్తూ ఉంటారు. ఓ అందమైన ముద్దులొలికే పాపల్లారా! ప్రతి ఇంట్లోనూ మీరు వికసిస్తూ ఉంటారు. స్నేహితులతో ప్రేమ పూర్వకంగా సోదర భావంతో మెలుగుతూ ఉంటారు. పేదవారికి, కష్టాలలో ఉన్నవారికి సహాయం చేస్తూ ఉంటారు. తన పర భేద భావమే లేకుండా మనమంతా ఒక్కటనే భావంతో ఉంటారు. ఓ అందమైన ముద్దులొలికే పాపల్లారా ప్రతి ఇంట్లోనూ మీరు వికసిస్తూ ఉంటారు.

ఈ మాసపు కథ

# ఏ కాలుది నేరం ?

– మర్యాద రామన్న కథలు

ఒక సారి రామన్న వద్దకు నలుగురు అన్నదమ్ములొచ్చారు. వాళ్ళు విచిత్రమైన ఫిర్యాదు తెచ్చారు. "మేము నలుగురమూ అన్నదమ్ములమే. పెద్దవాళ్లం ముగ్గురమూ ఫిర్యాదీలం. చిన్నవాడు ముద్దాయి. మీ తీర్పుకోసం వచ్చాం." అన్నాడు నలుగురిలోనూ పెద్దవాడు.



"మీ ఫిర్యాదేమిటి?" చెప్పమన్నట్లు పెద్దవాడివైపు చూశాడు రామన్న. అతను ఇట్లా చెప్పసాగాడు. "మేము నలుగురమూ కలిసి దూది వ్యాపారం చేస్తున్నాం. దూది కొట్టంలో ఎలుకల బాధ తప్పుతుందని మేము ఒక పిల్లిని పెంచుకుంటున్నాము. ఆ పిల్లి అంటే మాకందరికీ చాలా ఇష్టం.

దాని నాలుగు కాళ్లను నలుగురమూ పంచుకొని, ఎవరి కాలికి వాళ్ళం అలంకారాలు తగిలించాం. కొన్నిరోజులు గడిచాక మాలో నాల్గవవాడు తీసుకున్న కాలికి దెబ్బ తగిలింది. గాయం అయింది. ఆ కాలు తొందరగా నయం కావాలని నూనె గుడ్డలు చుట్టాడు. గుడ్డచుట్టిన కాలితో పిల్లి దీపం దగ్గరికి వెళ్లింది. గుడ్డ అంటుకుంది. దాంతో అది కంగారుపడిపోయి కొట్టంలో దూరింది. దూదికి మంటలు అంటుకుని కొట్టం అంతా తగలబడిపోయింది.

రామన్నగారూ! ఈ నష్టానికి కారణం ఆఖరివాడి కాలు. కనుక మిగిలిన ముగ్గురికీ అతను నష్ట పరిహారం చెల్లించాలి. అలా చెల్లింపమని మీ దగ్గరికి వచ్చాం" అని ముగించాడు.

రామన్న ముద్దాయి అయిన కడపటివాడివైపు చూశాడు – 'ఏమంటావు'? అన్నట్లుగా. నాల్గవవాడు ముందుకొచ్చి "తగలబడిన దూదిలో నా వాటా కూడా ఉంది. మరి దానికి నష్ట పరిహార మిచ్చేది ఎవరు? అది వదిలేసినా వీరికి పరిహారం చెల్లించటానికైనా నా దగ్గర డబ్బు లేదు" అన్నాడు. సభలోని వాళ్లకు పెద్దవాడు చెప్పిందే సబబుగా తోచింది. చిన్నవాడి మాటలు అసమంజసంగా అనిపించాయి. అప్పటికే రామన్న ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

"మీ ముగ్గురన్నదమ్ములూ చిన్నవాడికి పరిహారం చెల్లించాలి" అన్నాడు రామన్న. వాళ్లూ, వాళ్లతోపాటు సభలోని వారూ కూడా తెల్లబోయారు, ఆ తీర్పుకు. రామన్న తెలివితక్కువ తీర్పు చెప్పాడనే భావించారు. తమలో తాము గుసగుసలాడుకోసాగారు.

అప్పుడు రామన్న తన తీర్పును ఇల్లా వివరించాడు. "అయ్యలారా! దూది కాలటం నిజమే కాని ఆ ప్రమాదం మీ తమ్ముడి వాటా కొచ్చిన కాలు వల్ల జరగలేదు. మీ వాటా కాళ్ల వల్లే జరిగింది. ఎలాగంటే మీ తమ్ముడి వాటా కాలికి గాయమవడం వల్ల ఆ అవిటికాలుతో పిల్లి కొట్టంలోకి వెళ్లలేదుగదా! ఆ పిల్లిని దూది కొట్టంలోకి తీసుకెళ్ళినవి మిగిలిన మూడు కాళ్లు మాత్రమే. ఎందుకంటే అవే చక్కగా ఉన్నాయి కనుక. అంటే... పిల్లి... మీ వాటా కాళ్ల వల్లనే కొట్టం వరకూ వెళ్లింది. అందుచేత జరిగిన నష్టానికి బాధ్యులు మీరే తప్ప మీ తమ్ముడు ఎంత మాత్రమూ కాదు. అందుకనే మీరు ముగ్గురూ అతనికి పరిహారం చెల్లించాలి."

ఆ వివరణ విన్నాక రామన్న తీర్పు అక్కడివారికి ఎంతో నచ్చింది. ఎంతో సమంజసంగా ఉందనిపించింది. అందరూ రామన్నను అభినందించారు.

F3Q3E6


# 6 ముగ్గుల్లో సంక్రాంతి


- రచయితల బృందం


V1K7N7

## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి









1. చిత్రంలో ఏమేమి ఉన్నాయి?
2. చిత్రంలో ఎవరెవరున్నారు? వాళ్ళు ఏం చేస్తున్నారు?
3. మీరు జరుపుకునే పండుగల గూర్చి చెప్పండి.



"తమ్ముడూ! అత్తమ్మ ముగ్గులపోటీలో ముగ్గు వేస్తూంది. చూడటానికి వెళ్దాం వస్తావా?" అడిగింది అనూష

"ఓ, పద!" అన్నాడు ఆదిత్య.

"ముత్యాల ముగ్గుల్లో.... ముగ్గుల్లో గొబ్బిళ్ళో"
రతనాల ముగ్గుల్లో... ముగ్గుల్లో గొబ్బిళ్ళో"

మైకులో పాట వినిపిస్తోంది. పోటీలు జరుగుతున్న చోట చాలాసందడిగా ఉంది. ముత్యాలముగ్గులు, రంగులముగ్గులు, నాగబంధాలు, పెద్దపెద్దముగ్గులు ఎంత బాగున్నాయో... అత్తమ్మను వెతుకుతూ అనూష, ఆదిత్య ముందుకు వెళ్తున్నారు. నెమళ్ళముగ్గు, చిలకలముగ్గు, పద్మాలముగ్గు, సీతాకోకచిలుకలముగ్గు... ఏ ముగ్గు చూసినా దీనికే బహుమతి వస్తుందేమో అనిపిస్తుంది. ఇంతలో అత్తమ్మ కన్పించింది.



"అదిగో, అత్తమ్మ" అన్నాడు ఆదిత్య.

"అబ్బా! అత్తమ్మా! ఎంత పెద్దముగ్గు వేశావో! ఇదేంటి, అత్తమ్మా! ఒకేముగ్గులో భోగిమంట, గంగిరెద్దులు, గాలిపటాలు భలేగా వేశావే!" అంది అనూష.

"అవును, అనూషా! ఇది సంక్రాంతి ముగ్గులపోటీ కదా! అందుకే సంక్రాంతి విశిష్టతను తెలిపే అంశాలు ముగ్గులో వేశాను. తెల్లవారుఝామున వీధుల్లో వేసే భోగిమంట, సంక్రాంతికి సంప్రదాయంగా వచ్చే జానపద కళారూపమైన గంగిరెద్దులు, పిల్లలు సందడిగా ఎగురవేసే గాలిపటాలు నాముగ్గులో చూపించాను" అంది అత్తమ్మ.

"నేను భోగిమంటలో వేయడానికి నెలరోజుల నుండి ఆవుపేడ పిడకలు ఎండబెట్టి, దండగుచ్చి ఉంచాను." అంది అనూష.

"పాత కర్రసామాను, ఎండుకట్టెలు అన్నీ చేర్చి భోగిపండుగ రోజు భోగిమంట వేస్తారు. పిడకల దండలు కూడా వేస్తారు." చెప్పింది అత్తమ్మ.

"ఈ భోగిపళ్ళముగ్గు చూసారా! ఎంత బాగుందో!" అంది అత్తమ్మ.

"భోగిరోజు సాయంత్రం రేగుపళ్ళు, శెనగలు, చెరుకు ముక్కలు, చిల్లర డబ్బులు, బంతిపూల రేకులు కలిపి భోగిపళ్ళు పోస్తారు; కదక్కా" అన్నాడు ఆదిత్య సంబరంగా.


"అవునురా" అంది అనూష.

"చూడండి! ఇది ధనుస్సులముగ్గు. ధనుస్సంక్రమణం అంటే సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించడం. దీనినే 'ధనుర్మాసం' అని కూడా అంటారు. ఈ ముగ్గులో హరిదాసులు, పూర్ణకలశం, పొంగలి కుండలు కనబడుతున్నాయి. ఈ ముగ్గులో చెరుకు ముక్కలు ఉన్నాయి; ధాన్యపు బస్తాల బండి ఉంది. సంక్రాంతికి ధాన్యం ఇంటికిచేరి రైతులు అంతా సంతోషంగా ఉంటారు. పొంగళ్ళు వండుతారు. మరణించిన పెద్దలకు బట్టలు, పిండివంటలు, పండ్లు నివేదిస్తారు." చెప్పింది అత్తమ్మ.

"అత్తమ్మా! ఈ కోడి పుంజుల ముగ్గు చూడు. ఇవి నిజంకోళ్ళలా ఉన్నాయికదూ!" చూపించింది అనూష.
"సంక్రాంతికి కొన్ని ప్రాంతాల్లో కోడిపందాలు, పొట్టేళ్ళ పందాలు, ఎడ్లబండి పరుగు, గుర్రపు స్వారీ, సంగిడి రాళ్ళు ఎత్తటం, కుస్తీ పోటీలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు మొదలైనవి నిర్వహిస్తారు. బొమ్మల కొలువులు పెడతారు. కొన్ని ప్రాంతాలలో ప్రమాదకరమైన ఆచారాలు కూడా ఉన్నాయి." చెప్పింది అత్తమ్మ.

"అత్తమ్మా! ఈ ముగ్గు చూడు. ఒక స్త్రీ పది చేతులలో స్టెతస్కోపు, పుస్తకం, చీపురు, గరిటె, తుపాకీ, రెంచి, చక్రం, కొడవలి, పూల దండ, టెన్నిస్ రాకెట్ పట్టుకొని, మరొక రెండు చేతులతో పసిపాపను ఎత్తుకొని ఉంది. నల్లకోటు తొడుక్కుని ఉంది." చూపించింది అనూష.

"స్త్రీ శక్తిని తెలిపే ముగ్గు ఇది అనూషా! ఇలాగే సందేశాలు ఇచ్చే ముగ్గులు కూడా వేశారు చూడండి. ఈ ముగ్గులో రైతును, ఆ ముగ్గులో జాతీయజెండాను, జాతీయచిహ్నాలను వేశారు చూడండి. ఇక్కడ చూడండి,



ఓటు ఆవశ్యకాన్ని సూచిస్తూ ఓటు యంత్రం ముగ్గులో చూపించారు. చంద్రయాన్ ముగ్గు కూడా వేశారు చూడండి." చూపించింది అత్తమ్మ.

"అత్తమ్మా! ఇక్కడ ముగ్గులో ధాన్యాలు నింపారు, ఈ ముగ్గును ఉప్పులో రంగులుకలిపి దిద్దారు. ఆ ముగ్గును పూలరేకులతో నింపారు. అబ్బ! ఎన్నెన్ని ముగ్గులో..."

"ఈ ఎద్దుల ముగ్గులో కొమ్ములకు ఎంత చక్కని రంగులు వేశారో చూడండి! గొబ్బిళ్ళు, దీపాలు, పూర్ణ కలశాలతో ముగ్గులను అందంగా అలంకరించారు. మనకు ఆహారాన్ని అందించే పశువులను కనుముపండుగ నాడు ఇలాగే పూజిస్తారు. బంధువులు, పెళ్ళయిన ఆడపిల్లలు అందరూ వస్తారు. అంతా కలిసి విందుభోజనాలు చేస్తారు. జానపద కళారూపాలు ప్రదర్శించిన వారికి ధాన్యం, బట్టలు, కూరగాయలు, డబ్బులు మొదలైనవి గ్రామస్తులు బహూకరిస్తారు." చెప్పింది అత్తమ్మ.



"ఈ రథంముగ్గు చూడండి! దక్షిణాయనం నుండి ఉత్తరాయణానికి సూర్యుని ప్రయాణసూచికగా రథంలో సూర్యుణ్ణి నిలుపుతారు. రెండు చక్రాలకు ఆరు ఆకులు చొప్పున వేస్తారు. ఈ ముగ్గు 12 నెలలను సూచించే 12 ద్వారాలముగ్గు. ముగ్గుల్లో మన సంస్కృతి విలసిల్లుతుంది. ఏ సంస్కృతీ సంప్రదాయాలైనా, పండుగలూ, ఆచార వ్యవహారాలైనా అందరూ కలిసిమెలసి ఆత్మీయంగా ఉండటానికే! ఏరకమైన భేదభావాలున్నా అంతా మరిచిపోతారు" చెప్పింది అత్తమ్మ.

## పదాలు-అర్థాలు

పద్మం = తామరపువ్వు

విశిష్టత = గొప్పతనం, ప్రత్యేకత

సంబరం = సంతోషం

ధనుస్సు = విల్లు

రాశి = నక్షత్రాల గుంపు

కలశం = చిన్నకుండ లేదా చెంబు

గొబ్బిళ్ళు = ముగ్గుపై పసుపు కుంకాలు, పువ్వులు అలంకరించిన ఆవుపేడ ముద్దలు

అయనం = గమనం

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం

1. ముగ్గుల పోటీలు ఏయే సందర్భాలలో నిర్వహిస్తారు?
2. భోగిమంటలో ఏయే వస్తువులు వేయవచ్చు? ఏయే వస్తువులు వేయకూడదు?
3. మీ ప్రాంతంలో సంక్రాంతి పండుగ ఎలా జరుపుకుంటారు?
4. మీ ప్రాంతంలో సంక్రాంతికి ఏయే పోటీలు నిర్వహిస్తారు?

### చదవడం - వ్యక్తపరచడం



**అ) కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

"ఈ ఎద్దుల ముగ్గులో కొమ్ములకు ఎంత చక్కని రంగులు వేశారో చూడండి! గొబ్బిళ్ళు, దీపాలు, పూర్ణకలశాలతో ముగ్గులను అందంగా అలంకరించారు. మనకు ఆహారాన్ని అందించే పశువులను కనుమపండుగ నాడు ఇలాగే పూజిస్తారు. బంధువులు, పెళ్ళయిన ఆడపిల్లలు అందరూ వస్తారు. అంతా కలసి విందుభోజనాలు చేస్తారు. జానపద కళారూపాలు ప్రదర్శించిన వారికి ధాన్యం, బట్టలు, కూరగాయలు, డబ్బులు మొదలైనవి గ్రామస్తులు బహూకరిస్తారు"

1. ముగ్గులను వేటితో అలంకరించారు?

   ..........................................................................

2. పశువులను ఎలా పూజిస్తారు?

   ..........................................................................

3. జానపద కళాకారులకు గ్రామస్తులు ఏమి బహూకరిస్తారు?

   ..........................................................................

**ఆ) పాఠం చదవండి. ఖాళీలలో రాయండి.**

1. ఈ పాఠంలో ఉన్న పాత్రల పేర్లు ..........................................................
2. మీకు ఆశ్చర్యంగా అనిపించిన ముగ్గులు ..........................................................
3. రథం ముగ్గు దేనిని సూచిస్తుంది ..........................................................
4. స్త్రీశక్తి ముగ్గులో ఏమేమి ఉన్నాయి ..........................................................

ఇ) కింది పేరాను చదివి సమాధానాలు రాయండి.

## రంజాన్



ముస్లింలు జరుపుకునే పండుగలలో పవిత్రమైన పండుగ రంజాన్. దీన్ని "ఈద్" అని, 'ఈద్-ఉల్-ఫితర్' అని కూడా అంటారు. ఈ పండుగ ఇస్లాం కేలండర్ ప్రకారం రంజాన్ నెల మొదటిరోజున ప్రారంభమవుతుంది. ఈరోజు రాత్రి చంద్ర దర్శనం కాగానే మసీదుల్లో "తరావీ నమాజ్" అనే ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

రంజాన్ నెల అంతా ఉపవాసాలు ఉంటారు. తెల్లవారుఝామున నాలుగు గంటలకే నిద్ర లేస్తారు. సూర్యోదయానికి సుమారు గంటన్నరముందే భోజనం చేస్తారు. దీనిని 'సహరి' అంటారు. పగలంతా ఉపవాసం ఉంటారు. సూర్యాస్తమయం తరువాత ఉపవాసదీక్ష విరమిస్తారు. దీనిని 'ఇఫ్తార్' అంటారు.

'జకాత్' చేస్తారు. జకాత్ అంటే సంవత్సరానికి ఒకసారి వారి ఆదాయం, సంపదపై ఒక లెక్క ప్రకారం పేదలకు దానధర్మాలు చేయటం. రంజాన్ నెల చివరిరోజు చంద్రదర్శనంతో 'షవ్వాల్' నెల మొదలవుతుంది. ఆ మరునాడు పెద్దయెత్తున 'ఈద్' పండుగను జరుపుకుంటారు. అందరూ కొత్తబట్టలు ధరించి 'ఈద్‌గాహ్' కి వెళ్ళి, సామూహిక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

సేమ్యా పాయసాన్ని ఇంటిల్లిపాదీ ఆరోజు ఉదయం సేవిస్తారు. ఆ సాయంత్రం మిత్రులను, బంధువులను ఇంటికి పిలిచి, విందు ఏర్పాటుచేస్తారు.

1. 'రంజాన్' పండుగకున్న మరొక పేరు ఏమిటి?

.............................................................................................

2. సహరి అంటే ఏమిటి?

.............................................................................................

3. జకాత్ గురించి చెప్పండి.

.............................................................................................

4. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష ఎలా చేస్తారు?

.............................................................................................

## పదజాలం

అ) పాఠంలోని ఒత్తు పదాలను గుర్తించి రాయండి.

| | | | |
|---|---|---|---|
| పొంగళ్ళు | పెద్దముగ్గు | అత్తమ్మ | ............ |
| ............ | ............ | ............ | ............ |
| ............ | ............ | ............ | ............ |

ఆ) కింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| వెళ్ళు | × | ............ | ఎత్తు | × | ............ |
| సంతోషం | × | ............ | పొడవు | × | ............ |
| దక్షిణం | × | ............ | ఉదయించడం | × | ............ |
| లోపల | × | ............ | ముందు | × | ............ |

ఇ) కింది పదాలకు అర్థాలు రాసి వాక్యంలో ప్రయోగించండి.



ఉదా॥ సంబర పడ్డాడు = సంతోష పడ్డాడు.

మా తమ్ముడు నాన్న ఇచ్చిన కారు బొమ్మ చూసి సంతోషపడ్డాడు.

1. పశువులు = ................

........................................................................

2. నెలలు = ............

........................................................................

3. విశిష్టత = ............

........................................................................

4. కలశం = ............

........................................................................

5. దండలు = ............


........................................................................

ఈ) కింది గళ్ళలోని ఆహార పదార్థాల పదాలను వెతికి రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| హ | ల్వా | పు | అ | న్నం |
| పొం | గ | లి | ప్ప | పె |
| ల | వ్వ | హో | డా | రు |
| డ్డూ | లు | ర | లు | గు |
| వ | డ | గా | రె | లు |

ఉదా॥ పులిహోర

1. ......................
2. ......................
3. ......................
4. ......................
5. ......................



ఉ) కింది తమాషా పదాలు చూడండి. ఒకే పదం వేర్వేరు సందర్భాలలో వేరువేరు అర్థాలతో ఉపయోగిస్తున్నాము. కింది ఉదాహరణలను గమనించండి. కింద 'తల'కు సంబంధించిన పదాలు ఉన్నాయి. వాటి అర్థాలను తెలుసుకోండి. వాటిని ఉపయోగించి సొంత వాక్యాలు చెప్పండి.

ఉదా: మట్టి - మట్టి అంటే మన్ను.

| | |
|---|---|
| మట్టి మనుషులు - శ్రామికులు, శ్రమ జీవులు | తల - శిరస్సు, శిరము |
| మట్టిలో పుట్టిన - ప్రాంతంలో జన్మించిన | తలవంపులు - |
| మట్టిలో కలిసి పోవడం - మరణించడం | తలసరి - |
| మట్టి పాలైన - వృథా అయిన | తలపండిన - |
| మన్ను తిన్న పాములాగ - కదలక మెదలక | తలలో నాలుక - |
| నోట్లో మట్టి కొట్టడం - అన్యాయం చేయడం | తలదూర్చడం - |



## స్వీయరచన



**కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. సంక్రాంతి పండుగను ఎన్ని రోజులు జరుపుకుంటారు?
2. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలలో కనిపించే జానపద కళారూపాలు ఏవి?
3. భోగిపండుగను ఎలా జరుపుకుంటారు?
4. ధనుర్మాసంలో మీ గ్రామంలో ఏయే కార్యక్రమాలు చేస్తారు?

## సృజనాత్మకత

రంగు రంగు ముగ్గుల చిత్రాలను సేకరించండి. తరగతిలో ప్రదర్శించండి.

## ప్రశంస

మీ స్నేహితులు జరుపుకునే పండుగ సందర్భాలలో వారిని మీరు ఎలా అభినందిస్తారు?

## భాషాంశాలు



**అ) క్రింది వాక్యాలలో గీత గీసిన పదాలను గమనించండి.**

ఇది అందమైన నెమలి
రమ పచ్చని గాజులు కొన్నది.
ఇది తియ్యని మామిడి పండు.
అరిసెలు కమ్మని వంటకం.

అందమైన, పచ్చని, తియ్యని, కమ్మని అనేవి గుణాన్ని తెలిపే పదాలు. నెమలి, గాజులు, మామిడి, అరిసెలు అనే నామవాచకాల గుణాలని అవి తెలియజేస్తున్నాయి. ఒక వాక్యంలో నామవాచకం రంగు, రుచి, స్థితి - మొదలైన గుణాలను తెలియజేసే పదాలను 'విశేషణాలు' అంటారు. వాక్యంలో విశేషణం సాధారణంగా నామవాచకానికి ముందు వస్తుంది.

**ఆ) కింది వాక్యాలు చదవండి. విశేషణ పదాల కింద గీత గీయండి.**



1. ఏనుగు పెద్ద జంతువు.
2. నిమ్మకాయకు పుల్లని రుచి ఉంటుంది.
3. పుస్తకానికి అందమైన అట్ట వేసారు.
4. పచ్చని గోరింటాకు ఎర్రగా పండుతుంది.
5. కాచిన పాలు తాగాలి.

**ఇ) కింది విశేషణ పదాలను ఉపయోగించి, వాక్యాలు రాయండి.**

(చక్కని, మంచి, పెద్ద, తెలివైన, చురుకైన)

1. ..........................................................................
2. ..........................................................................
3. ..........................................................................
4. ..........................................................................

ఈ మాసపు గేయం

# గొబ్బిళ్ళ పాట

\- సంప్రదాయ జానపద గేయాలు

గొబ్బియళ్ళో గొబ్బియళ్ళో
గొబ్బియళ్ళో చందమామ ఓ చందమామ

విత్తు విత్తు నాటారంట
ఏం విత్తు నాటారంట
రాజుగారి తోటలో 'జాం విత్తు నాటారంట'
ఔనాట అక్కల్లార చంద్రగిరి భామల్లారా ॥గొబ్బి॥

పువ్వు పువ్వు పూచిందంట
ఏం పువ్వు పూచిందంట
రాజుగారి తోటలో "జాం పువ్వు పూచిందంట"
ఔనాట అక్కల్లార చంద్రగిరి భామల్లారా ॥గొబ్బి॥

పండు పండు పండిందంట
ఏం పండు పండిందంట
రాజుగారి తోటలో "జాం పండు పండిందంట"
ఔనాట అక్కల్లార చంద్రగిరి భామల్లారా
॥గొబ్బి॥



ఈ మాసపు కథ

# నకిలీ కన్ను

– నసీరుద్దీన్ కథలు

ధనికుడి లోభం, దరిద్రుడి దానం అని సామెత.

మౌల్వీ నసీరుద్దీన్ ప్రార్థన చేసుకునే మసీదు శిథిలావస్థకు చేరుకుంది. పాతదైపోయి ఎప్పుడైనా పడిపోయేట్టు ఉంది. అక్కడ ప్రార్థనకు వచ్చేవాళ్లంతా చాలా పేదవాళ్లు. మసీదును బాగుచేసుకోవాలన్న కోరిక ఉన్నా దానికి తగిన [illegible]వాళ్లు.

మౌల్వీ నసీరుద్దీన్‌కు మసీదు గురించిన చింత పట్టుకుంది. ప్రార్థన చేసుకునే సమయంలో మసీదు కూలితే? అన్నభయం పట్టుకుంది.

ఆయన బాగా ఆలోచించి మసీదు మరమ్మతుకు పథకం తయారుచేశాడు. ఇరుగు పొరుగు వాళ్లను సమావేశపరచాలని నిర్ణయించుకున్నాడు. ప్రయత్నం కూడా ప్రారంభించాడు.

ముందుగా మౌల్వీ ఒక ధనికుడి ఇంటికి వెళ్లాడు. ఆయన ఎంత ధనికుడో అంత లోభి కూడా. ఆ ధనికుడి కళ్లలో ఒకటి నకిలీది. ఎవరికీ అతని దగ్గర చందా అడగాలన్న ఊహ కూడా కలగదు. మౌల్వీ నసీరుద్దీన్ ముందు అతని ఇంటికే వెళ్లాడు.

ధనికుడు మౌల్వీ వచ్చిన కారణం అడిగాడు. మౌల్వీ నసీరుద్దీన్ ధనికుడికి మసీదు పరిస్థితి వివరించాడు.

ధనికుడు చందా ఇస్తాను కానీ ఒక షరతు ఉందన్నాడు.

మౌల్వీ అడిగాడు, "షరతు ఏమిటి?"

"నా కళ్లలో ఏది నకిలీ కన్నో కనుక్కో చందా ఇస్తాను" అన్నాడు ధనికుడు.



మౌల్వీ ధనికుడి కళ్లలోకి ఒకసారి చూసి ఎడమకన్ను నకిలీదని చెప్పాడు. ధనికుడు ఆశ్చర్యపోయాడు. ఎలా కనుక్కోగలిగావని అడిగాడు.

మౌల్వీ నవ్వుతూ జవాబిచ్చాడు "మీ అసలు కన్నుకు దయా ప్రేమా ఉండవు కదా! అందుకే అది రాయిలా కనిపిస్తున్నది. మీ ఎడమ కంట్లో కొంచెం దయా ప్రేమా కనిపించాయి. కాబట్టి అదే నకిలీదై ఉండాలి"

మౌల్వీ నసీరుద్దీన్ నిర్మొహమాటంగా చెప్పిన మాటలకు లోభి అయిన ధనికుడు సిగ్గు పడ్డాడు. మొత్తం మసీదు మరమ్మతు ఖర్చు తానే భరించడమే కాక మౌల్వీకి కూడా మంచి కానుక ఇచ్చాడు.

Y5Y3T4

# 7 పద్య రత్నాలు


- శతక కవులు

T8C6X5

## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి



1. చిత్రంలో ఏమి జరుగుతున్నది?
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
3. మీ బడిలో ఇలాంటివి ఏయే కార్యక్రమాలు చేస్తారు?
4. మీరెప్పుడైనా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారా?




# పద్యరత్నాలు



1. ధనము కూడబెట్టి దానంబు సేయక
తాను తినక లెస్స దాచుగాక
తేనెటీగ కూర్చి తెరువరి కియ్యదా
విశ్వదాభిరామ వినురవేమ! – వేమన

**అర్థాలు :** లెస్స = మిక్కిలి ఎక్కువగా / బాగుగా; తెరువరి = బాటసారి

**భావం :** సంపాదించిన డబ్బును దానమన్నా చేయాలి; లేదా తాను తినాలి. ఈ రెండు కాకుండా దాచిపెట్టడం వల్ల ఎలాంటి లాభం లేదు. తేనెటీగ ఎంతో కష్టపడి తేనెను కూడబెడితే చివరికి అది బాటసారుల పాలవుతోంది కదా!



2. పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ! – బద్దెన

**అర్థాలు :** పుత్రోత్సాహము = కొడుకు పుట్టిన సంతోషం; జన్మించినపుడె = పుట్టినపుడె; పొందుర = పొందుతాడు; జనులు = ప్రజలు; కనుగొని = గుర్తించి.

**భావం :** కొడుకు పుట్టగానే తండ్రికి ఆనందం కలుగదు. ప్రజలందరూ తన కొడుకు గొప్పదనం చూసి పొగిడినప్పుడే తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుంది.

3. పరులకొరకె నదులు ప్రవహించు, గోవులు
పాలనిచ్చు, చెట్లు పూలు పూయు
పరహితమ్ము కంటె పరమార్థమున్నదా
లలిత సుగుణజాల తెలుగుబాల! – జంధ్యాల పాపయ్యశాస్త్రి



**అర్థాలు :** పరులు = ఇతరులు; గోవులు = ఆవులు; పరహితము = ఇతరులకు మేలు; పరమార్థము = నిజమైన ప్రయోజనం.

**భావం :** ఇతరుల కొరకే నదులు ప్రవహిస్తున్నాయి. ఆవులు పాలనిస్తున్నాయి. చెట్లు పూలు పూస్తున్నాయి. ఇతరుల మంచి కంటె కోరదగినది ఇంకేమీ లేదు.

4. బలవంతుడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా
బలవంతమైన సర్పము
చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ! - బద్దెన



అర్థాలు : బలవంతుడు = బలంకలవాడు; పలువురు = చాలామంది; సర్పము = పాము; నిగ్రహించు = ఎదిరించి; పలుకుట = మాట్లాడడం.

భావం : నేను బలవంతుణ్ణి అనే గర్వంతో ప్రవర్తించ కూడదు. ఎందుకంటే ఎంతటి బలవంతుడైనా కొన్ని సమయాల్లో తనకంటె తక్కువ బలం కలవారి చేతులలో ఓడిపోయే అవకాశం ఉంది. చీమలకంటె పాము బలమైనదికదా! అయినా చీమలగుంపు పామును కుట్టి చంపేయగలదు.

5. మొదలు చూచిన కడుగొప్ప పిదప కుఱుచ
ఆది కొంచెము తరువాత నధికమగుచు
తనరు దినపూర్వ పరభాగజనితమైన
ఛాయపోలిక కుజనసజ్జనుల మైత్రి - ఏనుగు లక్ష్మణ కవి



అర్థాలు : కురచ = పొట్టి; ఆది = మొదలు; తనరు = వర్ధిల్లు; దినపూర్వ = ఉదయకాల; ఛాయ = నీడ; కుజన = చెడ్డవారి; సజ్జనుల = మంచివారి; మైత్రి = స్నేహం.

భావం : చెడ్డవారి స్నేహం ఉదయపు ఎండలో నీడలా ముందు గొప్పగా ఉండి తరువాత సన్నగిల్లుతుంది. మంచివారి స్నేహం మధ్యాహ్నపు ఎండలో నీడలా ముందు కొద్దిగా ఉండి మెల్లిగా వృద్ధిచెంది పెరుగుతుంది.

6. ఎంత చెలిమి యున్న ఎగతాళి చేయకు
సరసమంత నంత విరసమగును
మాట జారెనేని మరితీసుకోలేము
తెలిసి మెలగుమయ్య తెలుగుబిడ్డ! - నార్ల చిరంజీవి



అర్థాలు : చెలిమి = స్నేహం; ఎగతాళి = వెటకారం, వేళాకోళం; సరసం = ఇష్టం; విరసం = అనిష్టం.

భావం : ఎంత స్నేహితులైనా వారిని వేళాకోళం చేయకూడదు. ఇష్టం కాస్తా అనిష్టంగా మారవచ్చు. ఒకసారి నోరుజారితే వెనక్కు తీసుకోలేము. మాట్లాడేముందే ఆలోచించు కోవాలి.

7. మతము లెన్ని యున్న మానవత్వ మ్మొకటె
జాతు లెన్ని యున్న నీతి యొకటె
పదము లెన్ని యున్న పరమార్థ మొక్కటే
వాస్తవమ్ము నార్లవారిమాట! – నార్ల వెంకటేశ్వరరావు



అర్థాలు : మానవత్వం = మనిషికి ఉండే సహజగుణం; పరమార్థం = గొప్పదైన అర్థం, గొప్పతనం.

భావం : ఎన్ని మతాలున్నా తోటి మానవునికి సహాయం చేయమనే చెప్తాయి. జాతులెన్ని ఉన్నా నీతిగా బతకమనే చెప్తాయి. రచనలెన్నైనా వాటి గొప్పదైన భావం ఒకటే.

8. బ్రతుకవచ్చు గాక బహుబంధనము లైన
వచ్చుగాక లేమి వచ్చుగాక
జీవధనములైన జెడుగాక పడుగాక
మాట దిరుగలేరు మానధనులు – పోతన



అర్థాలు : బంధనములు = కట్లు; లేమి = పేదరికం; జీవధనం = ప్రాణం; మానధనులు = మానమే ధనంగా కలిగినవారు (పరువు కలిగినవారు)

భావం : మానధనులు మాట తప్పలేరు. బ్రతుకు ఉండవచ్చు, కష్టాలు రావచ్చు. పేదరికంలో మునిగిపోవచ్చు. ప్రాణాలే పోవచ్చు. ఏది ఏమైనా మాట తప్పరు.

9. పూజకన్న నెంచ బుద్ధి ప్రధానంబు
మాట కన్న నెంచ మనసు దృఢము
కులము కన్న మిగుల గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ వినురవేమ! – వేమన



అర్థాలు : బుద్ధి = ఆలోచన; ప్రధానము = ముఖ్యం; దృఢము = గట్టిది.

భావం : దేవునికి పూజలు చేయడంకంటె సాటి మనిషికి సహాయం చేయాలన్న ఆలోచన ముఖ్యం. మాట ఇవ్వడం కంటె ఆ మాటమీద నిలబడే దృఢమైన మనస్సు ముఖ్యం. పుట్టిన కులం కంటె మంచి గుణాలను చూసి గౌరవించడం ముఖ్యం.

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం



1. పద్యాలను రాగయుక్తంగా పాడండి.
2. పుత్రుడు అంటే ఎవరు?
3. పరహితం అంటే ఏమిటి?
4. స్నేహితులతో ఎలా ఉండాలి?

### చదవడం - వ్యక్తపరచడం

**అ) కింది పద్య పాదాలను చదవండి. వాటిని పద్యాలలో గుర్తించి గీత గీయండి.**

1. కులము కన్న మిగుల గుణము ప్రధానంబు
2. తేనెటీగ కూర్చి తెరువరి కియ్యదా
3. ఎంత చెలిమి యున్న ఎగతాళి చేయకు
4. పరహితమ్ముకంటె పరమార్థమున్నదా

**ఆ) కింది పద్య భావాన్ని చదవండి. అడిగిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

దేవుడికి పూజలు చేయడం కంటే సాటి మనిషికి సహాయం చేయాలన్న ఆలోచన గొప్పది. మాట ఇవ్వడం కంటే ఆ మాట మీద నిలబడే గట్టి మనసు ముఖ్యం. కులాన్ని గౌరవించటం కంటే మంచి గుణాలను చూసి గౌరవించడం ముఖ్యం.

1. పూజకంటే ముఖ్యమైనది ఏది?

..................................................................................................................

2. మాట ఇవ్వడం కంటే ముఖ్యమైనది ఏది?

..................................................................................................................

3. దృఢము అంటే అర్థమేమిటి ?

..................................................................................................................

4. కులముకన్న ఏది గొప్పది ?

..................................................................................................................

## పదజాలం

అ) కింది పదాలలో కొన్ని ఒత్తులు లోపించాయి. సరైన ఒత్తుతో పదాన్ని తిరిగి రాయండి.

| ్థ, ్ర, ్త, ్వ, ్ప |
|---|


పరమారము ఉదా॥ పరమార్థము

మానవతము ..........................

వాసవము ..........................

విగహము ..........................

కలవల్లి ..........................



ఆ) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.

1. మాటకన్న నెంచ మనసు దృఢము. ..........................
2. ఛాయపోలిక కుజనసజ్జనుల మైత్రి ..........................
3. మొదలు చూచిన కడుగొప్ప పిదప కుఱుచ. ..........................
4. తేనెటీగ కూర్చి తెఱువరి కీయదా. ..........................
5. ఎంత చెలిమి యున్న నెగతాళి చేయకు. ..........................


ఇ) కింది తమాషా వాక్యాలను చదవండి. జవాబుని కనిపెట్టండి.

ఉదా: వడను తినే **వడ** : జవాబు: దవడ

1. రోజాలను పెట్టుకునే **రోజాలు** – ____________
2. జనాలు తినే **జనం** – ____________
3. ఖండాలు, దేశాలు లేని **పటం** – ____________
4. ప్రేమను పంచే **కారం** – ____________
5. తాగలేని **పాలు** – ____________

## స్వీయరచన

అ) కింది పద్య పాదాలకు భావాలు సొంతమాటల్లో రాయండి.



1. ధనము కూడబెట్టి దానంబు సేయక
2. ఎంత చెలిమి యున్న ఎగతాళి చేయకు
3. పరుల కొరకె నదులు ప్రవహించు
4. మతములెన్నియున్న మానవత్వమొక్కటే

ఆ) కొడుకు పుట్టినందుకు ఆనందం ఎప్పుడు కలుగుతుందని కవి చెప్పాడు?

ఇ) కవి 'దానం చేయకుండా కూడబెట్టిన ధనం' గురించి ఏమని చెప్పాడో మీ సొంత మాటల్లో రాయండి.

ఈ) 'బలవంతుడు' పద్యం నుండి మీరేమి గ్రహించారో రాయండి.

## సృజనాత్మకత

పరుల కొరకే నదులు ప్రవహిస్తున్నాయి. ఆవులు పాలు ఇస్తున్నాయి. చెట్లు తేనె, పండ్లను ఇస్తున్నాయి కదా! ఇతరుల కోసం మీరు ఏమేమి చేయగలరో తెలుపుతూ చిన్న వ్యాసం రాయండి.

## ప్రశంస

పద్యాల పోటీలో బాగా పద్యాలు చెప్పిన మీ మిత్రులను అభినందించండి.



## భాషాంశాలు

అ) కింది వాక్యాలు చదవండి.

* సింధుజ పాట పాడింది.
* సింధుజ పాట పాడుతోంది.
* సింధుజ పాట పాడబోతోంది.

| | జరిగిన పని | జరుగుతున్న పని | జరగబోయే పని |
|---|---|---|---|
| ఉదా॥ | పాడింది | పాడుతోంది | పాడబోతోంది |
| | | | |
| | | | |

పాడింది, వెళ్ళాము, వంటి పదాలు జరిగిపోయిన పనిని గురించి తెలియజేస్తున్నాయి. ఇలా జరిగిపోయిన పనిని తెలిపేదానిని 'భూతకాలం' అంటారు. ఆడుతున్నాడు, ఎక్కుతూ ఉంది వంటి పదాలు జరుగుతున్న పనిని గురించి తెలియజేస్తున్నాయి. ఇలా జరుగుతూ ఉన్న పనిని తెలిపేదానిని 'వర్తమానకాలం' అంటారు. తెస్తాడు, వెళుతుంది వంటి పదాలు జరగబోయే పనిని తెలియజేస్తున్నాయి. ఇలా జరగబోయే పనిని గురించి తెలిపేదానిని 'భవిష్యత్‌కాలం' అంటారు.

**అ) కింది వాక్యాలు చదవండి. క్రియా పదాలను సరైన పట్టికలో రాయండి.**

1. ఇక్బాల్ బంతి ఆట ఆడుతున్నాడు.
2. సింధుజ పాట పాడింది.
3. రవి మామయ్య రేపు కొత్తబట్టలు తెస్తాడు.
4. కోతి కొబ్బరిచెట్టు ఎక్కుతున్నది.
5. మేము నిన్న సినిమాకు వెళ్ళాము.
6. నానమ్మ వచ్చే సోమవారం శ్రీశైలం వెళ్తుంది.

| జరిగిన పని | జరుగుతున్న పని | జరగబోయే పని |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

**ఆ) కింది వాక్యాలు చదవండి. ఏ కాలంలో ఉన్నాయో రాయండి.**

1. జోసఫ్ రేపు విశాఖపట్నం వెళ్తాడు. ..............................
2. రమణి సినిమా చూసింది. ..............................
3. హర్షిత పాఠం చదువుతున్నది. ..............................
4. ఖాదర్ కథ రాశాడు. ..............................
5. మణిమేఖల ముగ్గు వేస్తున్నది. ..............................
6. రాబర్ట్ రేపు ఇంటికి రంగులు వేస్తాడు. ..............................





ఈ మాసపు గేయం

# వీరగంధం




వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము మెడను వైతుము
పూలదండలు భక్తితో

తెలుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరినప్పుడు
తెలుగు వారల కత్తి దెబ్బలు
గండికోటను కాచినప్పుడు ॥వీర॥

నడుము కట్టిన తెలుగు బాలుడు
వెనుక తిరుగందెన్నడున్
బాస ఇచ్చిన తెలుగు బాలుడు
పారి పోవందెన్నడున్ ॥వీర॥

## కవి పరిచయం

### త్రిపురనేని రామస్వామి
(15-1-1887 - 16-1-1943)



హేతువాద రచయిత. ఈయన కవిరాజు బిరుదును పొందారు. ఈయన 'సూతపురాణం', 'పల్నాటి పౌరుషం' మొదలైన రచనలు చేశారు.

# పేను - నల్లి

– నీతిచంద్రిక

ఒక పేను రాజు గారి మంచంలో జీవిస్తూ ఉండేది. ఒకరోజు ఒక నల్లి వచ్చింది. పేను ఆ నల్లికి అతిథి మర్యాదలు చేసింది. తరువాత "ఎందుకు వచ్చావు" అని పేను నల్లిని అడిగింది. "నువ్వు నాకు మంచి స్నేహితుడవు, నిన్ను ఒకటి అడగాలని వచ్చాను. నువ్వు ఒప్పుకుంటే నా కోరిక తీరుతుంది" అంది నల్లి.

"నువ్వు నాకు ప్రాణంతో సమానం. నీ కోరిక నావల్ల తీరుతుంది అంటే అంతకన్నా నాకు సంతోషం ఏముంది? నన్ను బతిమాలనక్కర్లేదు" అంది పేను. అప్పుడు నల్లి "మిత్రమా! ఇంతకాలం మనుషుల రక్తం తాగి బతుకుతున్నాను. కాని ఏరోజు రాజుగారి రక్తం తాగలేదు. రుచి చూడలేదు. అప్పుడే కాచిననెయ్యి, తియ్యనిపప్పు, మంచికూరలు, రుచిగల వంటలు, ఊరగాయలు రకరకాల మాంసాలు, తీపిపదార్థాలు, పాలు, మీగడపెరుగులు, మత్తుపానీయాలు, సువాసన ద్రవ్యాలు మొదలైనవి తిని, తాగి హాయిగా నీడలో ఉండే రాజుల రక్తం చాలా రుచిగా ఉంటుంది. ఈ మంచం మీద నన్ను ఉండనిస్తే నా కోరిక తీరుతుంది" అంది.

"సరే కానీ, సమయానికి తగినట్లుగా ఉండి రాజుగారు బాగా నిద్రపోయాక, మెల్లగా కరిచి, రక్తం పీల్చుకొని, తెలివిగా అక్కడనుంచి తప్పించుకోవాలి సుమా!" అని చెప్పింది పేను.

"అలాగే చేస్తాను!" అని చెప్పి నల్లి ఒప్పుకొని మెల్లగా రాజుగారి మంచం మీద చోటు సంపాదించింది. ఒకరోజు రాజుగారు నిద్రలోకి వెళ్లకుండానే నల్లి ఆశపడి, తొందరపడి కరిచింది. అంతే! రాజుగారు ఉలిక్కిపడి లేచి, చిరాకుగా "ఎవరక్కడ?" అని అరచి "దీపం తీసుకురండి! నన్ను ఏదో కుట్టింది. వెతికి చంపండి" అని ఆజ్ఞాపించాడు.

సేవకుడు దీపం తెచ్చేలోపు నల్లి గబగబా వెళ్ళి మంచం సందులో దాక్కుంది. పేను వేగంగా వెళ్లలేక పోయింది. దీపపు వెలుతురులో పేను కనబడింది రాజభటునికి, అంతే! "ఇదే ప్రభూ! మిమ్మల్ని కుట్టిఉంటుంది" అని రాజుగారితో చెబుతూ ఆ పేనుని నలిపి, చంపేసాడు.



H1E4Y8

# 8 బారిష్టర్ పార్వతీశం


L2T5W2

చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి



1. చిత్రంలో సన్నివేశాల గురించి మాట్లాడండి.
2. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
3. మీరు ఎప్పుడైనా రైలు ప్రయాణం చేశారా? మీ ప్రయాణం గురించి చెప్పండి.

## కవి పరిచయం



### మొక్కపాటి నరసింహశాస్త్రి (9.10.1892- 5.3.1973)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జన్మించారు. 'బారిష్టరు పార్వతీశం' తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన హాస్య నవల. 'మొక్కుబడి', 'అభ్యుదయం', 'పెదమామయ్య' ఈయన ఇతర రచనలు.

# బారిష్టర్ పార్వతీశం

నర్సాపురం దగ్గర మొగలితుర్రు మా కాపుర స్థలం. నాపేరు వేమూరి పార్వతీశం. నేను టెయిలర్ హైస్కూలులో అయిదో ఫారము వరకు చదువుకున్నాను. నా స్నేహితుని హితోపదేశంతో ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు చదువుదామని నిశ్చయించుకున్నాను.

ఇంగ్లాండు ప్రయాణానికి తీసుకువెళ్ళవలసిన సామగ్రి గురించి ఆలోచించాను. కావలసిన సామాన్ల జాబితా రాసుకున్నాను. దంత ధావనానికి పది కచ్చికల పొడుము, నాలిక గీసుకోడానికి తాటాకు ముక్కలు, తలకు రాసుకోడానికి కొబ్బరినూనె, తుడుచుకోడానికి రెండు అంగవస్త్రాలు, దేశవాళి దువ్వెన, బొట్టు పెట్టుకోడానికి కొబ్బరిచిప్పలో కొంచెం చాదు, నీళ్ళు తాగడానికి మరచెంబు, రొట్టెలు కాల్చుకోడానికి గోధుమపిండి, నెయ్యి, కిరసనాయిలు, స్టవ్వు, అట్లపెనము, ఆవకాయ, పడుకోడానికి నర్సరావుపేట మడతమంచం, బొంత, నారింజపండు శాలువా, తుంగచాప చాలా అవసరమని కొన్నాను. ఇవన్నీ ఒక పెట్టెలో పెట్టి ఇంగ్లాండు బయలుదేరాను.

రైల్వేస్టేషనుకు చేరుకున్నాను. రైలు వచ్చి ఆగింది. ఒకరినొకరం తోసుకుంటూ హడావుడిగా ఎక్కేలోపు నా తలమీద ఉన్న సామాను వెనుక ఎక్కేవారిమీద పడిపోయింది. అతికష్టంమీద రైలు ఎక్కాను. నేను సామాను పైన పెట్టుకుంటున్నాను. హఠాత్తుగా రైలు కదిలింది. నా వెనుక బల్లమీద కూర్చున్న ఆడమనిషి ఒళ్ళో పడ్డాను. అక్కడ ఉన్నవాళ్ళంతా కడుపుబ్బ నవ్వారు. నాకు ప్రక్కవాళ్ళు కూర్చోవడానికి చోటు ఇచ్చారు. పెట్టె బల్లపై పెట్టాను. దానిమీద మడతమంచం పెట్టాను. దానిమీద చాప పెట్టాను. అక్కడొక గొలుసు కనపడింది. ఇవన్నీ పడిపోకుండా చేంతాడు వేసి ఆ గొలుసును లాగి బిగించి కట్టాను.



అంతే... రైలు ఆగింది. ఇద్దరు గార్డులు వచ్చి "ఈ సామాన్లు ఎందుకిలా గొలుసుకు కట్టావు?" అని అడిగారు. "రైలు కుదుపుకు కింద పడిపోకుండా, జాగ్రత్త కోసం కట్టానని" చెప్పాను. ఆ గొలుసు లాగితే రైలు ఆగుతుంది కాబట్టి యాభై రూపాయలు జరిమానా ఇవ్వమన్నారు. నా దగ్గరేమీ లేదని ప్రాధేయపడితే సామానుని, గొలుసుకి విప్పివేయమని చెప్పి వెళ్ళిపోయారు. మరునాడు చెన్నపట్నం చేరాను.

చెన్నపట్నంలో టోపీలు పెట్టుకున్నవారిని చూసి టోపీ పెట్టుకుంటే గౌరవం అనుకున్నాను. పెద్ద షాపులో టోపి కొనుక్కోవచ్చు అని అనుకొని షాపుకు వెళ్ళాను. షాపులో పైఅంతస్థులో ఆడమనిషి అమ్మే టోపీలు పెద్దవిగా, అందంగా కనిపించాయి. నాకు ఒక టోపీ కావాలన్నాను. నాకు నచ్చిన ఖర్జూరపాకులతో అల్లిన పెద్ద టోపీ కొనుక్కున్నాను. నా వెనకాల వున్న దొరా, దొరసానీ ఒకటే నవ్వు. బసకు చేరుకున్నాక అక్కడ ఉన్నాయన ఆ టోపీ చూసి ఒకటే నవ్వు నవ్వి, "ఏమయ్యా! ఆడవాళ్ళు పెట్టుకునే టోపీ కొన్నావు" అన్నాడు. "అందుకా! షాపులో వాళ్ళు నవ్వారు" అనుకున్నాను. "కొలంబోలో నాకు తెలిసిన వాళ్ళ కోసం" అని చెప్పాను.

తర్వాత రైలు ఎక్కి విశ్రాంతిగా కూర్చున్నాను. ఈ ప్రయాణంలో అప్పుడే పరిచయం అయిన వ్యక్తి నన్నూ, నా సామాన్లనూ చూసి నవ్వాడు. తూత్తుకూడిలో రైలు ఆగింది. "కొలంబో పోయేవాళ్ళు దిగండి" అని అరుస్తున్నారు. ఆడవాళ్ళు పెట్టుకొనే టోపీ కదా అని, టోపీని రైలులో విడిచి తక్కిన సామాను తీసుకుని పెట్టెలోనుంచి దిగాను. ఇంతలో రైలు బంట్రోతు పరిగెత్తుకు వచ్చి దొరసానిటోపీ తీసుకువచ్చి నా చేతిలో పెట్టాడు. ఎంతో విలువైన వస్తువు అప్పగించినట్లు వాడికి ఒక పావలా ఇచ్చాను. కొలంబోకి వెళ్ళే స్టీమరు ఎక్కేముందు మళ్ళీ కావాలనే ఆ టోపీని కింద వదిలి వచ్చాను. మళ్ళీ బంట్రోతు తెచ్చి ఇచ్చాడు. కొలంబోలో దిగినపుడు స్టీమరులో విడిచిపెట్టి వచ్చాను. స్టీమరు బంట్రోతు దొరసానిటోపీ తీసుకుని పరిగెత్తుకుని వచ్చి ఇచ్చాడు. ఆ టోపీని చూస్తే అసహ్యం వేసింది! దానికి బోల్డు డబ్బుపోసాను. వదిలేసిన ప్రతీ చోటా తీసుకువచ్చినవాడికి బహుమానాలు ఇవ్వడంకూడాను. ఆఖరుకు మార్సెల్సు పోయే స్టీమరులో కూడా నా సామానుతోపాటు టోపీ కూడా ఎక్కించారు. స్టీమరు మార్సెల్సు చేరింది.

మార్సెల్సు హోటలులో బంట్రోతు నా సామానును చిన్న గదిలో పెట్టాడు. ఆ గది ముందు కటకటాల తలుపులు ముడవడానికి వీలుగా ఉన్నాయి. గది బాగా చిన్నదిగా ఉంది. దానిని చూసి "ఇంత చిన్న గదిలో ఉండడమెలాగు అనుకున్నాను." ఆ చిన్న గదిలో దీపం వెలిగించారు. "ఇంత పెద్ద హొటలులో ఇంత చిన్న గదులేమిటో? ఒకవేళ నన్ను చూచి లోకువకట్టి ఇంకొకళ్ళకి పనికిరాని చిన్నిగది నాకు ఇచ్చారేమో" అనుకున్నాను. "ఈ చిన్నిగదిలోకి నేను రాను" అన్నాను. నా సామాను ఆ చిన్నిగదిలో పెట్టిన బంట్రోతు రమ్మన్నాడు. "ఈ గది అయితే నాకు అక్కరలేదు. ఇంకొక హోటలుకు వెళతాను'' అన్నాను. ''వాదించి లాభం లేదనుకున్నాడు" బంట్రోతు. నన్ను చేయి పట్టుకుని బలంగా చిన్నిగదిలోకి లాగి తలుపు వేశాడు. తలుపు వేసీవెయ్యడంతో గది అంతరిక్షమార్గంలోకి ఎగిరిపోయింది. నేను హడలిపోయి కెవ్వుమన్నాను! గది ఆగింది. బంట్రోతు తలుపు తీసి బయటకు



రమ్మన్నాడు. "ఇంకెన్ని వింతలో!" అని ఆశ్చర్యపోయాను. నన్ను వేరొక పెద్ద గదిలోకి తీసుకువెళ్ళి సామాను అక్కడ పెట్టాడు బంట్రోతు. "శ్రమపడకుండా మేడ ఎక్కే గది ఆ చిన్నగది" అని తెలిసి ఆ ఉపాయానికి ఆశ్చర్యపడ్డాను! వాళ్ళంతా నన్ను చూసి ఎంతగా నవ్వుకున్నారో అని సిగ్గుపడ్డాను.

ఇలా నా ఇంగ్లండు ప్రయాణంలో ఎన్నో ఆశ్చర్యకర సంఘటనలు, అవస్థలు చోటుచేసుకున్నాయి.

**అర్థాలు**

కాపురస్థలం = నివాసం ఉండే చోటు
ఐదవ ఫారము = 10వ తరగతి
హితోపదేశం = మేలుచేసే మాట చెప్పడం
బారిష్టరు = ఇంగ్లండులో న్యాయశాస్త్రం, చదువుకున్నవాడు
సామగ్రి = సామాన్లు, వస్తువులు
దంతధావనము = పళ్ళు తోముకోవడం
కచ్చికలు = కాల్చిన పిడకలు
అంగవస్త్రం = తువ్వాలు
చాదు = పిండితో తయారుచేసిన బొట్టు
దేశవాళీ దువ్వెన = చెక్కతో చేసిన దువ్వెన
గార్డు = కాపలావ్యక్తి
ప్రాధేయపడితే = బతిమాలితే
చెన్నపట్నం = మద్రాసు, చెన్నయ్
దొర = తెల్లజాతి పురుషుడు
దొరసాని = తెల్లజాతి స్త్రీ
బస = తాత్కాలిక నివాసం
బంట్రోతు = సేవకుడు
స్టీమరు = ఆవిరితో నడిచే పెద్ద నావ
అంతరిక్షమార్గం = ఆకాశంవైపు

## ఇవి చేయండి

### వినడం - ఆలోచించి మాట్లాడడం



1. పార్వతీశం ఇంగ్లాండు వెళ్లడానికి ఏయే వస్తువులు తీసుకున్నాడు? మీరైతే ఏమేమి తీసుకెళ్లుతారు?
2. పాఠంలో మీకు నవ్వు తెప్పించిన సన్నివేశాలు ఏవి?
3. పార్వతీశానికి లిఫ్ట్‌లో వెళ్లడం వింతగా అనిపించింది కదా! మీకు వింతగా అనిపించిన సందర్భాలు చెప్పండి?
4. మీ ఇంట్లో గాని చుట్టు పక్కల గాని మీకు నవ్వు తెప్పించిన సన్నివేశాలను చెప్పండి.
5. పార్వతీశం ప్రయాణంలో ఏ ఏ ఊర్ల మీదుగా వెళ్లాడో చెప్పండి.

## చదవడం - వ్యక్తపరచడం

**అ) కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

ఇంగ్లాండు ప్రయాణానికి తీసుకువెళ్ళవలసిన సామగ్రి గురించి ఆలోచించాను. కావలసిన సామాన్ల జాబితా రాసుకున్నాను. దంతధావనానికి పది కచ్చికల పొడుము, నాలిక గీసుకోడానికి తాటాకు ముక్కలు, తలకు రాసుకోడానికి కొబ్బరినూనె, తుడుచుకోడానికి రెండు అంగవస్త్రాలు, దేశవాళి దువ్వెన, బొట్టు పెట్టుకోడానికి కొబ్బరిచిప్పలో కొంచెం చాదు, నీళ్ళు తాగడానికి మరచెంబు, రొట్టెలు కాల్చుకోడానికి గోధుమపిండి, నెయ్యి, కిరసనాయిలు, స్టవ్వు, అట్లపెనము, ఆవకాయ, పడుకోడానికి నర్సరావుపేట మడతమంచం, బొంత, నారింజపండు శాలువా, తుంగచాప చాలా అవసరమని కొన్నాను.

**కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**



1. అంగవస్త్రాలు అంటే ఏమిటి?

జ. ..............................................................................

2. ఇంగ్లండు వెళ్ళటానికి పార్వతీశం ఏమేమి కొన్నాడు?

జ. ..............................................................................

3. "చాదు" దీనికి సరైన అర్థం రాసి వాక్యంలో ప్రయోగించండి.

జ. ..............................................................................

**ఆ) తప్పు - ఒప్పులను గుర్తించండి.**

1. పార్వతీశం ప్యారిస్ వెళ్ళాలనుకున్నాడు. ( )
2. తల దువ్వుకోడానికి దేశవాళి దువ్వెన కొనుక్కున్నాడు ( )
3. రొట్టెల కోసం మినపపిండి తీసుకువెళ్ళాడు. ( )
4. నల్లశాలువా కొనుక్కొన్నాడు. ( )
5. ఊరికి వెళ్ళాలంటే కావాల్సిన వస్తువుల జాబితా రాయాలి. ( )

**ఇ) కింది పేరా చదివి, ప్రశ్నలకు సరియైన జవాబులు రాయండి.**

గుర్రానికి సుడులు మొదలైనవి చూడాలి. గాడిదకు సుడి అవసరం లేదు. గుర్రాన్ని కొనాలి. గాడిదను కొనక్కర్లేదు. గుర్రానికి జీను కావాలి. గాడిదకు అక్కర్లేదు. అశ్వానికి సంరక్షణ కావాలి. గార్దభానికి రక్షణ అవసరం లేదు. హయానికి గుగ్గిళ్ళ దాణా పెట్టాలి. గాడిదకు ఇవి అనవసరం. కనుక నేను గాడిదనే అధిరోహిస్తాను అన్నాడు గణపతి.

**- 'గణపతి' చిలకమర్తి**

1. అశ్వం అంటే అర్థం ఏమిటి?

జ. ..................................................................

2. అశ్వానికి పర్యాయపదాలు ఏమున్నాయి?

జ. ..................................................................


3. గాడిదను మరోలా పిలవవచ్చు. ఆ పేరు ఏది?

జ. ..................................................................



4. గుర్రానికి .................... చూడాలి.

5. జీను .................... కు అవసరం లేదు.



**ఈ) కింది పదాలను ఉపయోగించి, సొంత వాక్యాలు రాయండి.**

1) సంరక్షణ ..................................................................

2) దాణా ..................................................................

3) అధిరోహించు ..................................................................

**ఉ) కింది వాక్యాలు చదివి, ప్రశ్నలు తయారు చేయండి.**

ఉదా॥ గణపతి గాడిదను అధిరోహిస్తాను అన్నాడు.

గణపతి ఏమన్నాడు?

1) హయానికి గుగ్గిళ్ళు దాణా పెట్టాలి.

ప్ర) ..................................................................

2) హయము అంటే అర్థం గుర్రం.

ప్ర) ..................................................................

3) అశ్వానికి సంరక్షణ కావాలి.

ప్ర) ..................................................................

4) నేను గాడిదనే అధిరోహిస్తాను.

ప్ర) ..................................................................

ఊ) కింది పేరా చదివి పట్టిక పూరించండి.

## నక్షత్రాలు - రాశులు - కార్తెలు



"రోహిణి కార్తె ఎండకు రోళ్ళు పగులుతాయి అన్నావు కదా అవ్వా! అంటే ఏమిటి?"

"మాయమ్మే ఎంత చల్లగా అడిగినావే! ఎండకి వీపులు పగిలిపోవడంలా! నెత్తి మాడిపోవడంలా! అదేనే మనవరాలా!" అంది అవ్వ.

"అసలు కార్తెలంటే ఏమిటవ్వా?"

"27 నక్షత్రాలు తెలుసుకదా! అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆరుద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ (పూర్వఫల్గుణి), ఉత్తర (ఉత్తర ఫల్గుణి), హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ట, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి. ఒక్కొక్క నక్షత్రానికి నాలుగు పాదాలు చొప్పున 27 నక్షత్రాలకు 108 పాదాలని, వాటిని 9 పాదాలకు ఒకరాశి చొప్పున 12 రాశులుగా మన పెద్దలు విభజించారు. అవి మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం. పూర్ణిమ నాడు ఏ నక్షత్రం ఉంటే ఆ నెలకు, ఆ పేరు పెట్టారు. అశ్విని ఉంటే ఆశ్వీయుజమాసం, కృత్తిక ఉంటే కార్తీక మాసం...ఇలా. ఇవన్నీ చంద్రమానం మీద ఆధారపడి ఉన్నాయి. మన ప్రాచీన రైతులు వ్యవసాయ విజ్ఞానాన్ని సూర్యమాన, చంద్రమాన ఆధారంగా పొందుపరిచారు. సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ కార్తె పేరు పెట్టారు. సంవత్సరానికి 27 కార్తెలు. కార్తెలు, నెలలు, రాశుల వారీగా పైరులకు వాతావరణం ఎలా ఉంటుందో సామెతల రూపంలో అందరికి అర్థమయ్యేలా చెప్పుకున్నారు."

"అశ్విని కురిస్తే అంతా నష్టం"

"భరణిలో చల్లిన నువ్వు చేను కాయకు బరిగెడు గింజట" ఇలా చెప్పుకుంటే ఎన్నో...

ఋ) రాశుల పేర్లను పట్టికలో వెతికి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| మ | క | రం | వృ | శ్చి | కం |
| మి | ధ | క | న్య | సిం | హం |
| థు | ను | ర్కా | కుం | మీ | తు |
| నం | స్సు | ట | భం | నం | ల |
| మే | షం | కం | వృ | ష | భం |

ఉదా॥ మేషం

1. ...................... 5. ......................

2. ...................... 6. ......................

3. ...................... 7. ......................

4. ...................... 8. ......................

## పదజాలం

అ) ఈ పాఠంలో కొన్ని విదేశీ పట్టణాల పేర్లు ఉన్నాయి. అవి రాయండి. మీకు తెలిసిన మరికొన్ని విదేశీ పట్టణాల పేర్లు కూడా రాయండి.

______________________ ______________________


______________________ ______________________

______________________ ______________________

______________________ ______________________

ఆ) కింది ఏక వచన పదాలకు బహువచన పదాలు రాయండి.

| ఏక వచనం | బహు వచనం |
| --- | --- |
| రైలు | – ______________ |
| సామాను | – ______________ |
| విమానం | – ______________ |
| వస్త్రం | – ______________ |
| గది | – ______________ |
| బహుమానం | – ______________ |



ఇ) కింది తమాషా వాక్యాలను చదవండి. ఒకే హల్లును ఉపయోగించి అర్థవంతమైన వాక్యాలు రాయడం కష్టమే! అయినా అసాధ్యం కాదు. ఇలాంటివి రాయడానికి మీరు ప్రయత్నం చేయండి.

1. కాకీక కాకికి కాక, కేకికా? (కేకి అంటే నెమలి)
2. నాన్న నన్నెననిన నేను నాన్న నన్ను.
3. మీ మామ మా మామా? మా మామ మీ మామా?
   మీ మామ మీ మామే! మామామ మామామే!



## స్వీయరచన



**కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. ప్రయాణం కొరకు పార్వతీశం కొన్న వస్తువులేమిటి?
2. పార్వతీశం ఇంగ్లాండు వెళ్ళాలని ఎందుకు నిశ్చయించుకున్నాడు?
3. మార్సెల్సు హోటల్‌లో పార్వతీశం ఎందుకు గాబరా పడ్డాడు?
4. ప్రతిరోజూ మీరు బడికి వస్తారుకదా! ఏమేమి తెచ్చుకుంటారు?



## సృజనాత్మకత

మీరు చేసిన ఒక ప్రయాణం గురించి, చూసిన ప్రదేశం గురించి దినచర్య రాయండి. అందులో మీరు వెళ్ళిన ఊరు - ఏ రోజున వెళ్లారు - ఎవరెవరు వెళ్లారు - ఏయే వాహనాలతో వెళ్ళారు - ఏయే ప్రదేశాలను చూశారు - ఏయే ఆహార పదార్థాలను తిన్నారు - ఆ ప్రదేశాలను చూసినపుడు మీకు ఎలా అనిపించింది - వంటి వివరాలతో మీ దినచర్య రాయండి.

..................................................................................................................................

..................................................................................................................................


..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................



## ప్రశంస

ప్రయాణంలో మీకు సహకరించిన మీ తోటి ప్రయాణికుడ్ని ఎలా ప్రశంసిస్తారు?



## భాషాంశాలు

ఇంతకుముందు పాఠాలలో క్రియల గురించి తెలుసుకున్నారుకదా! క్రియాపదాలను వాక్యాలలో వాడినప్పుడు అవి రెండు రకాలుగా పనిచేస్తాయి.

ఒకటి : వాక్యాన్ని పూర్తిచేయటం

రెండు : వాక్యాన్ని పూర్తిచేయకపోవడం

కింది ఉదాహరణలు చూడండి :

| సమాపక క్రియ వాక్యాలు | అసమాపక క్రియ వాక్యాలు |
|---|---|
| 1. రవి ఇంటిపని చేశాడు. | 1. రవి ఇంటిపని చేసి... |
| 2. పిల్లలు నడుస్తున్నారు. | 2. పిల్లలు నడుస్తూ... |
| 3. లత పరీక్ష రాస్తుంది. | 3. లత పరీక్ష రాసి... |

పై వాక్యాలు చూడండి. మొదటి మూడు వాక్యాలు పూర్తి అయ్యాయి కదా! కాని తర్వాతి మూడు వాక్యాలు పూర్తి కాలేదు. వాటిని పూర్తిచెయ్యాలంటే మరొక పదం ఏదో రావాలి. వాటిని ఎట్లా పూర్తి చెయ్యవచ్చో చూడండి:



4. రవి ఇంటిపని చేసి నిద్రపోయాడు.
5. పిల్లలు నడుస్తూ మాట్లాడుతున్నారు.
6. లత పరీక్ష రాసి వస్తుంది.

ఇప్పుడు ఈ వాక్యాలు పూర్తి అయిన వాక్యాలే కదా! దీన్నిబట్టి మనం ఈ కింది విషయం తెలుసుకుంటాం: చేశాడు, నడుస్తున్నారు, రాస్తుంది, నిద్రపోయాడు, మాట్లాడుతున్నారు, వస్తుంది - ఇవి వాక్యాన్ని పూర్తిచేయ గలవు. కనుక ఇవి సమాపక క్రియలు. చేసి, నడుస్తూ, రాసి - ఇవి వాక్యాన్ని పూర్తి చేయలేవు. కనుక ఇవి అసమాపక క్రియలు.

ముందు పాఠాలలో సమాపక అసమాపక క్రియాపద వాక్యాలను గుర్తించండి.

| సమాపక క్రియ వాక్యాలు | అసమాపక క్రియ వాక్యాలు |
|---|---|
| 1. ........................................ | 1. ........................................ |
| 2. ........................................ | 2. ........................................ |
| 3. ........................................ | 3. ........................................ |



ఈ మాసపు పాట

# ఏరువాక పాట



ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ
నల్లన్ని మబ్బులు నల్దిక్కుల పారి
॥ఏరు॥

ఎఱ్ఱన్ని మెఱుపులు ఏగిరించాయి
ఎత్తైన కొండలు ఎతకరించాయి
పరుగెత్తి కోకిలా పాట పాడింది
నెమిలమ్మ మైమరచి నాట్యమాడింది
॥ఏరు॥

ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ...
జనమందరూ వేగ కూడి రావాలి
గాదెల్లో విత్తనాలు గట్టిగా తేవాలి
గంపల్లో విత్తనాలు దండిగా తేవాలి
॥ఏరు॥

మృగశిర చిందించె ముసలెద్దు రంకేసె
దుక్కిటెద్దుల దెచ్చి అరక గట్టాలి
దున్నినా చేలన్నీ మిన్నగా పండాలి
ఒక్క గింజకు కోటి గింజలవ్వాలి.
॥ఏరు॥

## కవి పరిచయం



### బిరుదురాజు రామరాజు (16-4-1925 : 8-2-2010)

ఈయన వరంగల్ దగ్గర దేవనూరు గ్రామంలో జన్మించారు. తెలుగు జానపద గేయసాహిత్యంపై మొట్టమొదటగా పరిశోధన చేశారు. వీరి రచనలు 'తెలుగు జానపద రామాయణం', 'తెలుగు సాహిత్యోద్ధారకులు' మొదలైనవి.

# అత్యాశ

– పంచతంత్రం కథ

ఒక అడవిలో జిత్తులమారి నక్క ఒకటి ఉండేది. నక్కలు సాధారణంగా పులులు, సింహాలు వంటి క్రూరమృగాలు వేటాడి తినగా వదిలిన మాంసం, ఎముకలు తిని బతుకుతాయి. 'రెక్కాడితే గాని డొక్కాడదు' అన్న బాధ వీటికి లేదు.

అటువంటి అవకాశం కోసం ఎదురుచూస్తున్న నక్కకు ఒక సువర్ణావకాశం లభించింది. ఒక వేటగాడు వేటాడి చంపిన లేడిని భుజాన వేసుకొని వస్తూ బలిష్ఠంగా ఉన్న ఒక అడవి పందిని చూశాడు. గురి చూసి ఆ సూకరాన్ని బాణంతో కొట్టాడు. అది గురి తప్పి పందికి గాయం చేసింది. అడవి పంది రెచ్చిపోయి కోపంతో వేటగాడి మీద దాడి చేసి చంపింది. తర్వాత పంది కూడా చచ్చింది.

ఆ పెనుగులాటలో ఒక పాము కూడా నలిగి నుగ్గునుగ్గయి చనిపోయింది. నక్క ఎదురుగా చనిపోయిన పంది, పాము, లేడి, మనిషి కళేబరాలు ఉన్నాయి. నక్క ఆనందానికి అంతులేదు. 'బోలెడంత మాంసం. మంచి విందు భోజనం! ఆహా! ఏమి నా భాగ్యం! అదృష్టవంతుణ్ణి చెరిపేవాడు లేడు' అని మనసులో అనుకుంది.

'సరేలే! ఈ నాలుగింటి మాంసం ఎప్పుడైనా తినవచ్చు ముందుగా నరాలతో తయారు చేసిన వింటి నారిని తింటాను' అనుకొని వింటిని కాలికింద పెట్టి నారిని కొరికింది. బిగుతుగా ఉన్న నారి తెగిపోవటం వల్ల విల్లు వేగంగా నక్క గుండెకు తగిలింది. ఆ దెబ్బకు నక్క గిలగిల తన్నుకుంటూ చనిపోయింది.

ఆశ అతిగా మారితే అన్నీ కావాలనుకుంటారు. ఉన్నవాటితో సర్దుకోలేరు. ఆ ప్రయత్నంలో ఆలోచన లేకుండా ప్రవర్తిస్తారు. దానితో ప్రమాదం కొని తెచ్చుకుంటారు అనటానికి ఈ 'అత్యాశ' కథ ఒక ఉదాహరణ.



L4W8A8

# 9 రాజు - కవి


K6G1K6

## చిత్రం చూడండి - ఆలోచించి మాట్లాడండి



1. చిత్రంలో ఏమి జరుగుతున్నది?
2. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?
3. రాజు ఏమి మాట్లాడుతూ ఉండవచ్చు?

### కవి పరిచయం



**గుర్రం జాషువా (28.9.1895- 24.7.1971)**

ప్రశస్తమైన పద్యశిల్పం, సులలితమైన ధార, దళితులు, అట్టడుగు వర్గాల పట్ల అపారమైన ప్రేమ, సామాజిక అసమానతల పట్ల ఆగ్రహం జాషువా కవిత్వ లక్షణాలు. గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. నవయుగ కవి చక్రవర్తి, కళాప్రపూర్ణ బిరుదులున్నాయి. 'ఫిరదౌసి', 'గబ్బిలము', 'క్రీస్తు చరిత్ర' మొదలైనవి ఈయన రచనలు.

# రాజు - కవి



"తాతయ్యా! రాజు, కవి - వీరిలో ఎవరు గొప్పవారో తెలుసుకుని రమ్మన్నారు మా మాస్టారు" అని చెప్పాడు రవి. నువ్వే మనుకుంటున్నావు అని అడిగాడు తాతయ్య. "బోలెడు డబ్బు ఉంటుంది కాబట్టి రాజే గొప్పవాడుకదా" అన్నాడు రవి. "నీకు ఒక కథ చెప్తాను. అది విన్నాక ఎవరు గొప్పవారో నువ్వే చెప్పు" అని చెప్పడం మొదలుపెట్టాడు తాతయ్య. "అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలో ఒక పెద్ద రాజ భవనంలో ఒక అబ్బాయి పుట్టాడు. అదే రాజ్యంలో పూరి గుడిసెలో ఒక అబ్బాయి పుట్టాడు. రాజ భవనంలో పుట్టినతడు పెరిగి రాజయ్యాడు. గుడిసెలో పుట్టిన బిడ్డ పెరిగి బాగా చదువుకుని కవి అయ్యాడు.

సౌధరాజమందు జన్మించె నొక బిడ్డ
పూరి గుడిసెలోన పుట్టె నొకడు
ప్రబలి రందు నిందు రాజయ్యె నొక్కడు
నొకడు రానురాను సుకవియయ్యె

రాజుగారు అధికారం చలాయించేవారు. ఆయన దగ్గర చాలా ధనం ఉండేది. కవిగారు తన కలంతో ఎన్నో గొప్ప కథలు, కావ్యాలు రచించారు. రాజుగారి ఇల్లేమో రత్నాలతో నిండి అందంగా ఉండేది. కవిగారి ఇల్లు కష్టాలతో నిండి ఉండేది.

అతని రాజదండ మధికార ధన మయం
బితని కలము కావ్యశతతమమ్ము
అతని యిల్లు మేటి రతనాల రుచి మయం
బితని యిల్లు గండ వితతి మయము

కవిగారు బాగా కావ్యాలు రాస్తారు అని రాజుగారికి తెలుసు. రాజు గారికి అధికార మున్నదని కవికి తెలుసు. కాని ఇద్దరూ ఆత్మగౌరవం కలిగినవారే! ఒకరి నొకరు లెక్క చేయరు.

కవినెఱుగు రాజు, రాజును
కవి యెఱుగును కవిని రాజు గణియింపండా
కవి రాజు గణన సేయడు
కవియును రాజిద్దరాత్మ గౌరవ కాముల్

రాజుగారంటే ప్రజలందరికీ భయం. ఆయన అధికారాన్ని చూసి, ధనాన్ని చూసి ప్రజలు రాజుగారిని పొగిడేవారు. రాజు ధన మిచ్చి సేవకులను నియమించుకున్నాడు. కవి అంటే ప్రజ లందరికీ ఎంతో ఇష్టం. ఆయన చెప్పే మాటలు విని, రచనలను చదివి ఎన్నో విషయాలు తెలుసుకునేవారు. అడగక ముందే ఆయనకు కావలసిన సహాయం చేసేవారు.

భయముతోడ రాజు బ్రస్తుతింతురు ప్రజల్
భక్తి తోడ కవిని బ్రస్తుతింత్రు
జీత మిచ్చి రాజు సేవింపబడుచుండు
జీత మీక సుకవి సేవ లందు

రాజుగారు తరచూ యుద్ధాలు చేసేవాడు. కనుక ఆయన కత్తి ఎప్పుడూ రక్తాన్ని కురిపించేది. కవిగారి కలము అమృతం వంటి చల్లనైన రచనలు అందించేది. రాజుగారు ఈ ప్రపంచం మొత్తాన్ని పరిపాలించాడు. కవిగారి రచనలు చదివిన వారికి ఆనందం, మరణించాక పుణ్య ఫలం లభించేది. ఈ లోకాన్ని, పై లోకాన్ని కూడా కవి ఏలగలిగాడు.

రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు
సుకవి చేతి కలము సుధలు గురియు
ఆతడేలగలుగు యావత్ప్రపంచంబు
నీత డేలగలుగు నిహము పరము

కొన్నాళ్ళకు రాజు గారు మరణించారు. 'అయ్యయ్యో చుక్క రాలింది' అన్నారు అందరూ. కవిగారు కూడా మరణించారు. ఆయన మరణించినా కూడా ఆకాశంలో ధ్రువ తారలా ప్రకాశిస్తున్నాడు అన్నారు. రాజుగారి గుర్తుగా రాతి విగ్రహాలు చెక్కించి రాజ్య మంతటా నిలిపారు. కొన్నాళ్ళకు రాజును ప్రజలు మరిచిపోయారు. కవి రాసిన రచనలు, పద్యాలు పాడుకుంటూ కవిని ఎప్పటికీ మరిచిపోలేదు. ఆయన ప్రజల నాలుకలపై జీవించే ఉన్నాడు.

రాజు మరణించె నొక తార రాలిపోయె<br>
కవియు మరణించె నొక తార గగన మెక్కె<br>
రాజు జీవించె రాతి విగ్రహము లందు<br>
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు

"ఇప్పుడు చెప్పు రవీ! నీకేమి అర్థమయిందో" అన్నారు తాతయ్య. రవికి ఏమి అర్థమై ఉంటుందో ఊహించండి.

## పదాలు-అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| సౌధం | = | భవనం | గండవితతిమయం | = | రాళ్లతో నిండినది |
| జన్మించటం | = | పుట్టటం | ఆత్మగౌరవకాములు | = | తమ గౌరవాన్ని కోరుకొనేవారు |
| ప్రబలటం | = | ఎక్కువ కావటం | ప్రస్తుతింతురు | = | పొగుడుతారు |
| సుకవి | = | మంచి కవి | సుధ | = | అమృతం |
| శతం | = | నూరు; వంద | ఇహం | = | ఈ లోకం |
| రాజదండం | = | రాజశాసనం | పరం | = | పరలోకం |
| ధనమయం | = | ధనంతో నిండినది | గగనం | = | ఆకాశం |
| రుచిమయం | = | కాంతితో నిండినది | తార | = | నక్షత్రం |

## ఇవి చేయండి



### వినడం - ఆలోచించి మాట్లాడడం

1. పద్యాలను లయ బద్ధంగా రాగంతో పాడండి.
2. రాజుగారిని ప్రజలు ఎందుకు గౌరవిస్తారు?
3. ప్రజల నాలుకల మీద జీవించటం అంటే ఏమిటి?

## చదవడం - వ్యక్తపరచడం

అ) కింది పేరా ఆధారంగా తప్పు (   ) ఒప్పు (   ) గుర్తించండి.

రాజుగారు తరచూ యుద్ధాలు చేయవలసి వచ్చేది. కనుక ఆయన కత్తి రక్తాన్ని కురిపించేది. కవిగారి కలము అమృతం వంటి చల్లనైన రచనలు అందించేది. రాజుగారు ఈ ప్రపంచం మొత్తాన్ని పరిపాలించారు. కవిగారి రచనల వలన చదివిన వారికి ఆనందం, మరణించాక పుణ్య ఫలం లభించేది. ఈ లోకాన్ని పై లోకాన్ని కూడా కవి ఏలగలిగాడు.



1. కవి కత్తి రక్తాన్ని కురిపించేది. (   )
2. రాజు తరచూ యుద్ధాలు చేసేవాడు. (   )
3. రాజు రచనలు ఆనందం కలిగిస్తాయి. (   )
4. కవి ఈ లోకాన్ని, పై లోకాన్ని ఏలగలిగాడు. (   )
5. రాజు ఈ ప్రపంచాన్ని పరిపాలించాడు. (   )

ఆ) కింది వాక్యాలకు ప్రశ్నలు తయారుచేయండి.

1. రాజుగారు తరచూ యుద్ధాలు చేయవలసి వచ్చేది.

   ..............................................................?

2. కవిగారి కలము అమృతం వంటి చల్లనైన రచనలు అందించేది.

   ..............................................................?

3. ఈ లోకాన్ని పైలోకాన్ని కూడా కవి ఏలగలిగాడు.

   ..............................................................?

ఇ) పాఠం ఆధారంగా ఖాళీలను పూరించండి.

1. పై పద్యాలలో కురియు అనే అర్థం వచ్చే పదం ఏది? ..................................
2. కవి కలము నుంచి ఏమి పుట్టాయి ? ......................
3. అధికారం, ధనంతో కూడినది ఏది? ......................
4. ఎవరి ఇల్లు రతనాలతో కూడి ఉంది ? ......................

ఈ) గేయ పంక్తులను సరిచేసి రాయండి.

1. రక్తంబు రాజు వర్షించు చేతి కత్తి

..............................................................................................

2. గురియు చేతి కలము సుధలు సుకవి

..............................................................................................

3. యావత్ప్రపంచంబు ఆతడేలగలుగు

..............................................................................................

4. పరము నీతడేలగలుగు ఇహము

..............................................................................................

ఉ) కింది వాక్యాలు పాఠంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించి గీత గీయండి.

1. భక్తితోడ కవిని ప్రస్తుతింత్రు
2. రాజు జీవించె రాతి విగ్రహములందు
3. కవియును రాజిద్దరాత్మ గౌరవ కాముల్
4. పూరి గుడిసెలోన పుట్టె నొకడు

ఊ) కింది పేరా చదివి ఖాళీలు పూరించండి.

ఒకనాడు గజనీ మహమద్ నిండు కొలువులో మహాకవియైన పిరదౌసిని పిలిచి తన విజయ యాత్రలను గ్రంథంగా రచించమన్నాడు. పద్యానికి ఒక బంగారు నాణెం ఇస్తానన్నాడు. కవి సరే అన్నాడు. ముప్పయి సంవత్సరాలు శ్రమించి అరవై వేల పద్యాలతో "షానామా" అనే గ్రంథం రచించాడు కవి. సభా మధ్యంలో రాజుగారికి అందజేశాడు. కాని రాజు బంగారు నాణాలకు బదులు వెండి నాణాలు ఇచ్చాడు. బాధపడిన కవి రాజుగారిని నిందిస్తూ కొన్ని పద్యాలు రాశాడు. రాజు తప్పు గ్రహించి బంగారు నాణాలు పంపాడు.

పిరదౌసి పీఠిక నుంచి - జాషువా

1. పై కథలో రాజు పేరు .............................................
2. కవి రాసిన గ్రంథం పేరు .......................................
3. గ్రంథం రాయడానికి ...................... సంవత్సరాల కాలం పట్టింది.
4. కొలువు అనే పదానికి సమాన అర్థం ఇచ్చే పదం ఇదే పేరాలో ఉంది. వెతికి రాయండి.

..............................................................................................

5. ఈ పేరాకు తగిన శీర్షిక సూచించండి. ................................

6. పై పేరాలో సంయుక్తాక్షరాలున్న పదాలను వెదికి రాయండి.

విజయయాత్ర .................. .................. ..................

.................. .................. .................. ..................



## పదజాలం

అ) కింది పదాలకు అర్థం రాసి సొంతవాక్యంలో రాయండి.

1. సౌధం : భవనం

ఉదా : మా ఊళ్ళో ఎత్తైన భవనాలు ఉన్నాయి.

2. శతం : ....................

........................................................................................

3. సుధ : ....................

........................................................................................

4. తార : ....................

........................................................................................

5. గగనం : ....................

........................................................................................

ఆ) కింది పదాలకు పర్యాయపదాలు (అదే అర్థం ఇచ్చే ఇతర పదాలు) రాయండి.

ఇల్లు : నివాసం, గృహం,

ధనం : .................., ..................

కత్తి : .................., ..................

ప్రపంచం : .................., ..................

తార : .................., ..................



ఇ) కింది పదాల ఆధారంగా చివర 'లం' వచ్చే పదాలు రాయండి.

| | | |
|---|---|---|
| ఉదా: | రాసే సాధనం | కలం |
| 1. | నీరు | .......లం |
| 2. | నాగలి | .......లం |
| 3. | రంధ్రం | .......లం |
| 4. | సమయం | .......లం |
| 5. | శక్తి | .......లం |



## స్వీయరచన

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రాజును ప్రజలు ఎలా గౌరవించారు?
2. రాజు మరణిస్తే ఏమి జరిగింది?
3. పూరిగుడిసెలో పుట్టినవాడు ఏమయ్యాడు?
4. రాజుకు, కవికి గల తేడాలను పట్టికలో రాయండి.



| రాజు | కవి |
|---|---|
| 1. పెద్ద భవనంలో జన్మించాడు. | ........................................ |
| 2. ........................................ | పెరిగి పెద్దయ్యాక కవి అయ్యాడు. |
| 3. ఇల్లు ధనంతో నిండి ఉండేది. | ........................................ |
| 4. ........................................ | కవి కలం అమృతం కురిపిస్తుంది. |
| 5. రాజు మరణిస్తే ఒక తార రాలిపోయింది. | ........................................ |
| 6. ........................................ | ప్రజల నాలుకపై జీవించాడు. |



## సృజనాత్మకత

పాఠంలో రాజు-కవి వీరిలో ఎవరు గొప్పవారో తెలుసుకున్నారు కదా! ఒక రోజు కొంగ కాకిని చూసి నీకన్నా నేనే గొప్ప అన్నది. అప్పుడు వాటి మధ్య జరిగే సంభాషణను రాయండి.

కొంగ : నేను తెల్లగా అందంగా ఉంటాను.

కాకి : ..............................................................................................

కొంగ : ..............................................................................................

కాకి : ..............................................................................................

కొంగ : ..............................................................................................

కాకి : ..............................................................................................

కొంగ : ..............................................................................................

కాకి : ..............................................................................................



## ప్రాజెక్టు పని

మీ ఉపాధ్యాయుని సహాయంతో పాఠశాల వార్షికోత్సవానికి ఏ సామగ్రి కొనవలసి వస్తుందో పట్టిక తయారు చేయండి.



## భాషాంశాలు

పాఠంలోని నామవాచకం, సర్వనామం, విశేషణం, క్రియా పదాలను గుర్తించి ఈకింది పట్టికలో రాయండి.

| నామవాచకం | సర్వనామం | విశేషణం | క్రియ |
|---|---|---|---|
| | | | |



ఈ మాసపు పాట

# వెయ్యేళ్ళ కవినోయ్



వేయి సంవత్సరాల్ వెనకాల కవినోయ్
వేయి సంవత్సరాల్ పోయాక కవినోయ్
వేదాల ఋక్కులో పాడాను నేనోయ్
వాల్మీకి గొంతులో ప్రవహించినానోయ్

॥ వేయి ॥

వ్యాసర్షి గీతిలో ప్రజ్వరిల్లానోయ్
కవి గుణాఢ్యుని రక్తకణమునూ నేనోయ్
కాళిదా'సా'నంద కంపిత స్వరమునోయ్
ఆంధ్రకవి భవభూతి అమృత శోకాన్నోయ్

॥ వేయి ॥

తిక్కన్న తెలుగులా తీర్పునైనానోయ్
ఈనాటి పాటలో ఇమిడిపోయానోయ్
అన్ని బాసల వన్నె చిన్నె లైనానోయ్
ఆశాంతములవరకు ఆవరించానోయ్

॥ వేయి ॥

## కవి పరిచయం



### అడివి బాపిరాజు (15-1-1887:16-1-1943)

అడవి బాపిరాజు కవి, నవలాకారుడు, కథకుడు, చిత్రకారుడు. 'నారాయణరావు', 'హిమబిందు', 'గోనగన్నారెడ్డి', 'శశికళ', 'గంగిరెడ్డు' మొదలయినవి ఆయన రచనల్లో కొన్ని.

# దెబ్బకు దెబ్బ





ఒకరైతు ఉండేవాడు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొని వచ్చి పట్టణంలో అమ్మేవాడు. ఆ డబ్బుతో కుటుంబాన్ని పోషించుకొనేవాడు. ఒకరోజు కట్టెలుకొట్టి బండినిండా వేసుకొని పట్టణానికి వస్తున్నాడు రైతు. ఒక వ్యాపారి ఎదురై కట్టెలు బేరం చేశాడు. ఈ కట్టెలబండి ఎంతకిస్తావని అడిగాడు. రైతు 20 రూపాయలన్నాడు.

'సరే నాతో రా' అన్నాడు వ్యాపారి. రైతు బండి తోలుకొని వ్యాపారి వెంట అతని ఇంటికి వెళ్లాడు. అక్కడ కట్టెలు దించాడు. వ్యాపారి ఇరవై రూపాయలు ఇచ్చాడు.

రైతు ఖాళీ బండి తోలుకొని వెళ్లబోతుంటే వ్యాపారి ఆపాడు, "అదేంటి రైతన్నా! నా బండి తీసుకొని ఎక్కడికి పోతున్నావ్? కట్టెలతో పాటు బండి కూడా కొనుక్కున్నాను కదా!"

"అదెట్లా" అన్నాడు రైతు.

"ఎట్లా ఏమిటి. ఇట్లానయ్యా" అంటూ వ్యాపారి వివరించాడు, "ఈ కట్టెల బండికి నన్ను ఇరవై రూపాయలడిగావా, లేదా?"

"అడిగాను"

"నీకు ఇరవై రూపాయలు ఇచ్చానా?"

"ఇచ్చావు"

"అయితే చెప్పు. ఈ బండి నాదై పోయింది కదా!" అంటూ వ్యాపారి బండి లాక్కున్నాడు. అమాయకుడైన రైతు తలవంచుకొని ఇంటికి వెళ్ళిపోయాడు. రైతుకు ఒక కూతురు ఉంది. చాలా తెలివైన పిల్ల. తండ్రి నడిగి కథంతా తెలుసుకుంది. వ్యాపారికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది. మరుసటిరోజు కొన్ని ఎండు కట్టెలు మోపు కట్టుకుని అమ్మడానికి వ్యాపారి ఇంటికి వెళ్లింది.

"షావుకారు గారూ! కొన్ని ఎండుకట్టెలున్నాయి. కొంటారా?"

"ఎంత"

"రెండు గుప్పిళ్లు ధాన్యం"

వ్యాపారికి బేరం చాలా లాభసాటిగా కనిపించింది. కట్టెలమోపు తీసుకున్నాడు. ఆ అమ్మాయికి రెండు గుప్పిళ్ల ధాన్యం ఇవ్వబోయాడు.

"షావుకారుగారూ! ధాన్యంతోపాటు మీ రెండు గుప్పిళ్లూ కూడా కోసి ఇవ్వండి".

ఆమె మాటలు విని వ్యాపారి చకితుడయ్యాడు, "అంటే అర్థమేమిటి?"

"ఏముందిందులో అర్థంకాకపోవడానికి. రెండు గుప్పిళ్ల ధాన్యానికి మీరు కట్టెలు కొన్నారా, లేదా?"

"అవును"

"మరి ఇవ్వండి. ధాన్యంతో పాటు మీ రెండు గుప్పిళ్లూ కూడా కోసి ఇవ్వండి. నేను సరిగ్గానే చెప్పానా?"



"అదెట్లా" గట్టిగా కేకలు వేశాడు వ్యాపారి. "ధాన్యంతో పాటు ఎవరైనా తమ గుప్పిళ్లు కూడా కోసి ఇస్తారా?"

"ఎందుకు ఇవ్వకూడదు?"

"కాని, ఎట్లా?"

అమ్మాయి అంది, "మా నాన్న కట్టెలతోపాటు బండి కూడా మీకు ఇవ్వలేదూ! అట్లాగే. మరచి పోయారా?"

ఆమె మాటలు విన్న వ్యాపారి తల సిగ్గుతో వంగిపోయింది. ఆమెకు క్షమాపణ చెప్పి బండి ఇచ్చేశాడు.

N5L8R5



96

# భారత రాజ్యాంగం
## ప్రాథమిక బాధ్యతలు

**విభాగము - IVఎ, అధికరణం 51ఎ**

**ఈ కిందివి భారతదేశ పౌరుల బాధ్యతలు :**


- భారత రాజ్యాంగానికి బద్ధులై ఉండాలి. జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని, రాజ్యాంగ ఆశయాలను, రాజ్యాంగ సంస్థలను గౌరవించాలి.
- భారత స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన మహోన్నత ఆశయాలను అనుసరించాలి.
- భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమైక్యతను గౌరవించటం, సంరక్షించటం.
- భారతదేశాన్ని సంరక్షించుకోవటం, అవసరం ఏర్పడినప్పుడు (ప్రభుత్వం ఆదేశించినపుడు) ప్రభుత్వానికి సేవలందించటం.
- మత, ప్రాంతీయ, వేర్పాటువాద, భాషాపరమైన సంకుచిత భావాలకు అతీతంగా సోదర భావాన్ని, స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించటం, స్త్రీల గౌరవాన్ని కించపరిచే పద్ధతులు, చర్యలను నిరసించటం.
- విభిన్న సంస్కృతుల సమ్మిళితమైన మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించటం.
- అడవులు, సరస్సులు, నదులు, వన్యమృగాలతో సహా మన జాతీయ పర్యావరణాన్ని సంరక్షించటం, సమస్త జీవుల పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండడం.
- శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా వాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ వాదాన్ని పెంపొందించుకోవటం.
- హింసావాదాన్ని వ్యతిరేకించటం, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించటం.
- వ్యక్తిగతంగాను, సమిష్టి కృషి ద్వారాను ఉన్నత శిఖరాలను అధిరోహించటం ద్వారా దేశ ఔన్నత్యాన్ని పెంపొందించటం.
- ఆరు నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించటం ఆ పిల్లల తల్లిదండ్రుల లేక సంరక్షకుని బాధ్యత (86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజు చేరింది.)

CHILD LINE 1098 NIGHT & DAY

ఒక్క సంగీత మేదో పాడునట్లు భా
షించునప్డు విన్పించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు స్ప
ష్టోచ్చారణంబున నొనరు భాష
రసభావముల  సమర్పణ శక్తియందున
నమరభాషకు దీటైన భాష
జీవులలో నున్న చేవయంతయు చమ
త్కృతి పల్కులన్ సమర్పించు భాష

భాష లొకపది తెలిసిన ప్రభువు చూచి
భాష యన నిద్ది యని చెప్పబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించినట్టిది తెలుగు భాష.

– విశ్వనాథ సత్యనారాయణ



STATE COUNCIL OF EDUCATIONAL RESEARCH & TRAINING
AMARAVATI

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
ఆంధ్రప్రదేశ్